# క్రైమ్ మిర్రర్ ®
Voice of Anti Corruption

హైదరాబాద్
20-6-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 90

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




## 'మూసీ' ప్రాజెక్టుకు భారీ ముందడుగు!

గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు కేంద్ర రక్షణ శాఖ భూములు

బాపు ఘాట్ వద్ద నిర్మాణానికి తొలగిన అడ్డంకులు

మరోసారి సత్తా చాటుకున్న సీఎం రేవంత్

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో :** మూసీ నది పునరజ్జీవన ప్రాజెక్టులో ముందడుగు పడింది. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. హైదరాబాద్ బాపు ఘాట్ వద్ద ప్రతిపాదించిన గాంధీ సరోవర్ ప్రాజెక్టు నిర్మాణానికి గాను.. కేంద్ర రక్షణ శాఖకు చెందిన అత్యంత విలువైన భూముల బదలాయింపునకు.. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్నాథ్ సింగ్, ఇండియన్ ఆర్మీ అధికారికంగా ఆమోదం తెలిపాయి. ఇది నిజంగా గొప్ప వార్త. కేంద్ర రాష్ట్ర విరుద్ధ ప్రభుత్వాలు ఉండగా.. కీలకమైన రక్షణ శాఖ భూముల బదలాయింపు జరగడం సాధారణ విషయం కాదు.

- మిగతా 3వ పేజీలో




దేశ బవిష్యత్ పాఠశాలల్లోనే ఉందని గ్రహించి, అందుకు అనుగుణంగా తెలంగాణ విద్యావిధానంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కార్పోరేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చి దిద్దుతున్నామని అన్నారు. పేదలు ఆత్మన్యూన తకు లోనుకకాకుండా వారి పిల్లలకు కూడా ప్రైవేట్ తరహా విద్యను అందిస్తున్నామని అన్నారు. అందుకోసం విద్యార్థులు ఆత్మగౌరవంతో పాఠశాలకు వెళ్లేందుకు ఎడ్యుకేషన్ కిట్లను పంపిణీ చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. విద్యపై నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నామని చెప్పారు.

# పాఠశాలల్లోనే దేశ భవిష్యత్

నాణ్యమైన విద్యతో పాటు వసతి సౌకర్యాలు

తెలంగాణలో విద్యావిధానంలో విప్లవాత్మక మార్పులు

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ది

విద్యార్థులకు యంగ్ ఇండియా స్కూల్ కిట్స్ అందచేత

విద్యామంత్రిగా తానే నిరంతర పర్యవేక్షణ

సఎల్బీ స్టేడియం కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్,జూన్19(ఆర్ఎన్ఎ): అందుకోసం విద్యాశాఖను తానే స్వయంగా నిర్వహిస్తున్నానని చెప్పారు. నగరంలోని ఎల్బీ స్టేడియంలో యంగ్ ఇండియా ఎడ్యుకేషన్ కిట్ల పంపిణీని గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో కలిసి సీఎం ప్రారంభించారు. గురుకుల పాఠశాల విద్యార్థులకు 22 వస్తువులతో కిట్లు అందించారు. వసతి గృహ విద్యార్థులకు 10, పాఠశాల విద్యార్థులకు 7 వస్తువులతో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు.

- మిగతా 2వ పేజీలో



## మీనాక్షి పై కుట్ర వెనుక ఆ ఎమ్మెల్యే!

వ్యక్తిగత సహాయకుడు సైతం

కాంగ్రెస్ హై కమాండ్ సీరియస్

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** మీనాక్షి నటరాజన్ పై కుట్ర చేసింది ఓ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే నా? ఆ ఎమ్మెల్యే మొదటిసారి గెలిచారా? ఆయన వ్యక్తిగత కార్యదర్శి మీనాక్షి నటరాజన్ పై ఉన్న పాత కక్షతో సమాచారాన్ని బిజెపికి అందించారా? హైదరాబాద్ నాంపల్లి కోర్టులో ఆమెపై ఉన్న ఒక ప్రైవేటు పిటిషన్ అంతర్గత సమాచారాన్ని ఉద్దేశపూర్వకంగా లీక్ చేశారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. కాంగ్రెస్ నిఘా వర్గాలు దీనిని గుర్తించినట్లు ప్రచారం నడుస్తోంది.

మిగతా 2లో

## 'సాయి కృష్ణ' కేసులో వైసీపీకి షాక్!

మరోసారి చతురత ప్రదర్శించిన చంద్రబాబు

- కాపు కులం కార్డును తెరపైకి తెచ్చిన వైయస్సార్ కాంగ్రెస్
- ప్రభుత్వపరంగా చర్యలతో బాధిత కుటుంబానికి భరోసా
- నీరుగారి పోయిన జగన్ ప్రయత్నాలు



**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ఏపీలో సాయి కృష్ణ అనే యువకుడి అదృశ్యం రాజకీయంగా కలకలం రేపింది. విజయవాడ కృష్ణలంకకు చెందిన సాయి కృష్ణపై వివిధ నేరాలు ఉన్న నేపథ్యంలో విచారణ కోసం పోలీసులు తీసుకెళ్లారు. ఈ క్రమంలో సాయి కృష్ణ కనిపించకుండా పోయారు. వెంటనే ఇది రాజకీయ రంగు పులుముకుంది. సాయి కృష్ణ కాపు సామాజిక వర్గానికి చెందిన యువకుడు కావడంతో వైసిపి ఆ కోణంలో రాజకీయం మొదలు పెట్టింది. సాక్షి మీడియాలో పతాక స్థాయిలో కథనాలు వచ్చాయి. కాపు యువకుడు లాకప్ డెత్ అంటూ కథనాలు వచ్చాయి.

మిగతా 2లో

## ఎంపీ వర్సెస్ ఎమ్మెల్యే!

ఎచ్చెర్ల సీటుపై ఇద్దరు నేతల కన్ను

మెగా బ్రదర్ నాగబాబు సైతం..



**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ఏపీలో కీలక నియోజకవర్గం శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల ఒకటి. ఇక్కడ నుంచి కావలి ప్రతిభా భారతి, కిమిడి కళా వెంకట్రావు లాంటి వారు ప్రాతినిధ్యం వహించారు. మొన్నటి ఎన్నికల్లో ఇక్కడ నుంచి బిజెపి అభ్యర్థి నడికుదుటి ఈశ్వరరావు గెలిచారు పొత్తులో భాగంగా.

మిగతా 3లో

## తెలంగాణపై పవన్ పక్కా పొలిటికల్ స్కెచ్!



ఏపీ మాదిరిగానే రాజకీయం చేయాలన్న ఆలోచన

ముందుగా గ్రేటర్ పట్టు పెంచేందుకు ఆరాటం

తరువాత వరంగల్, ఖమ్మం కార్పొరేషన్లపై..

అందుకే హైదరాబాద్ లో పార్టీ కార్యాలయం ప్రారంభం

## నేడు పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ!

46,85,838 మంది రైతుల ఖాతాల్లో రూ.3,125.47 కోట్లు

అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

## టెలిగ్రామ్‌పై నిషేధం సబబే

నీట్ పేపర్ లీకేజీ నివారణే లక్ష్యం

కేంద్రం నిర్ణయాన్ని సమర్థించిన ఢిల్లీ హైకోర్టు

టెలిగ్రామ్ సంస్థ దాఖలు చేసిన పిటిషన్ కొట్టివేత




## కొడాలి నాని అరెస్ట్!

పాత కేసుల విచారణకు ప్రాసిక్యూషన్ అనుమతి

వరుసగా కేసులు చుట్టుముట్టే అవకాశం



**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో :** మాజీ మంత్రి కొడాలి నాని అరెస్టు తప్పదా? ఆయన చుట్టూ ఉచ్చు బిగిస్తోందా? పాత కేసులు తెరపైకి వస్తుండడం దేనికి సంకేతం? పొలిటికల్

మిగతా 2లో

## వచ్చే ఎన్నికల్లో మళ్లీ బిఆర్ఎస్‌దే అధికారం

కెసిఆర్ సిఎం కావడం ఖాయం

మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్



నారాయణపేట,జూన్19: రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం,

మిగతా 3లో

# మీనాక్షి పై కుట్ర వెనుక ఆ ఎమ్మెల్యే!

(మొదటి పేజీ తరువాయి)

**నామినేషన్ తిరస్కరణ..**

మధ్యప్రదేశ్ నుంచి మీనాక్షి నటరాజన్ కు రాజ్యసభ అవకాశము కల్పించారు అగ్రనేత రాహుల్ గాంధీ. గాంధీ కుటుంబం పట్ల వీర విధేయతతో ఉండే మీనాక్షి నటరాజన్ కు అవకాశం ఇచ్చారు. అయితే ఆమె నామినేషన్ తిరస్కరణకు గురైంది. ఓ కేసుకు సంబంధించి తన ఆఫిడవిట్లో పేర్కొనలేదని బిజెపి నుంచి అభ్యంతరాలు రావడంతో నామినేషన్ తిరస్కరణకు గురైంది. ఈ మొత్తం వ్యవహారంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన తెలంగాణ ఎమ్మెల్యే తో పాటు ఆయన వ్యక్తిగత సహాయకుడు బిజెపికి సహకరించినట్లు ఇప్పుడు తేలడం ఆందోళన కలిగిస్తోంది.

**జరిగింది ఇది..**

నారాయణపేట కాంగ్రెస్ నేత కుంభం శివకుమార్ రెడ్డి తనపై లైంగిక వేధింపులకు, బెదిరింపులకు పాల్పడ్డారంటూ హైదరాబాద్ తార్నాకకు చెందిన ఒక మాజీ మహిళా కార్పొరేటర్ గతంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజకీయ ఒత్తిడితో పోలీసులు కేసును సరిగ్గా దర్యాప్తు చేయలేదని ఆరోపిస్తూ ఆమె నాంపల్లి కోర్టులో ప్రైవేటు పిటిషన్ దాఖలు చేశారు. పార్టీ ఇన్చార్జ్ గా ఉన్న మీనాక్షి నటరాజన్ కు తాను పలుమార్లు ఫిర్యాదు చేసినా ఆమె చర్యలు తీసుకోలేదని.. నిందితుడిని పార్టీ అధికారిక వేదికలపై ప్రోత్సహిస్తున్నారని పేర్కొంటూ మీనాక్షి నటరాజన్ ను రెస్పాండెంట్ గా చేర్చారు. కానీ ఈ సమాచారాన్ని తెలుసుకున్న రాజ్యసభ బిజెపి అభ్యర్థి మహేష్ కేవత్.. ఆ కేసు వివరాలను ప్రస్తావిస్తూ.. మీనాక్షి నటరాజన్ ఆ వివరాలను దాచారంటూ రిటర్నింగ్ ఆఫీసర్ కు ఫిర్యాదు చేయడంతో ఆమె నామినేషన్ తిరస్కరణకు గురైంది.

**రాహుల్ సీరియస్**

తెలంగాణ నుంచి కొత్తగా గెలిచిన ఓ ఎమ్మెల్యే తో పాటు వ్యక్తిగత సహాయకుడికి ఇందులో పాత్ర ఉందని హై కమాండ్ భావిస్తోంది. మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ మధ్యప్రదేశ్లో సైతం ప్రకంపనలు సృష్టించింది. అక్కడ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు దీక్షలు చేపడుతున్నారు. అదే సమయంలో తెలంగాణ కాంగ్రెస్ సీనియర్లు సైతం అధిష్టానానికి పెద్ద ఎత్తున ఫిర్యాదులు చేస్తున్నారు. పరిస్థితి తీవ్రతను గుర్తించిన రాహుల్ గాంధీ తెలంగాణ కాంగ్రెస్పై గట్టిగానే ఆగ్రహంగా ఉన్నారు. పదవులతో సంబంధం లేకుండా తెలంగాణ కాంగ్రెస్ కోర్ టీం మొత్తానికి గట్టి వార్నింగ్ ఇచ్చినట్లు తెలుస్తోంది. త్వరలోనే కాంగ్రెస్ రాష్ట్ర కమిటీ లో భారీ మార్పులు, చేర్పులు ఉంటాయని పెద్ద ఎత్తున ప్రచారం నడుస్తోంది.

# తెలంగాణపై పవన్ పక్కా పొలిటికల్ స్కెచ్!

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** పవన్ కళ్యాణ్ పక్క పొలిటికల్ స్కెచ్ తోనే తెలంగాణలో అడుగు పెట్టారా? పార్టీ కార్యాలయం ప్రారంభం వెనుక భారీ వ్యూహం దాగి ఉందా? అందుకే వరుసగా తెలంగాణలో పర్యటనలు చేస్తున్నారా? గ్రేటర్ లో సత్తా చాటుతారా? మిగతా కార్పొరేషన్ల ఎన్నికల్లో సైతం బరిలో దిగుతారా? నిర్ణయాత్మక శక్తిగా ఎదుగుతారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా ఇలానే ఉన్నాయి.

**మారుతున్న రాజకీయ అడుగులు..**

హైదరాబాదులో నూతనంగా ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని పవన్ ప్రారంభించారు. ఇటీవల జరిగిన నాటకీయ పరిణామాల నడుమ కార్యాలయం ప్రారంభోత్సవానికి భారీగా జనసైనికులు తరలివచ్చారు. ఒక వ్యూహం ప్రకారం ఇటీవల పవన్ కళ్యాణ్ చర్యలు తెలంగాణలో కనిపిస్తున్నాయి. మొన్న ఆ మధ్యన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నాడు జరిగిన పరిణామాలు అందరికీ తెలిసిన విషయమే. తప్పకుండా జనసేన ను తెలంగాణలో విస్తరిస్తానని సవాల్ చేశారు పవన్. అటు తరువాత వరుసగా పర్యటనలు చేస్తున్నారు. హన్మకొండలో ఓ బాలుడిని పరామర్శించారు. వరంగల్ మహంకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. విజయవాడ వెళుతుండగా సూర్యాపేటలో పవన్ కళ్యాణ్ కు గ్రాండ్ వెల్కమ్ కూడా లభించింది. ఇటీవల తెలంగాణ వాదులతో సవాళ్లు విసిరిన పవన్ కళ్యాణ్.. కొద్ది రోజులకే తెలంగాణలో పార్టీని యాక్టివ్ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

**ఆ కార్పొరేషన్లపై ఫోకస్..**

త్వరలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు జరగనున్నాయి. గ్రేటర్ ను మూడు కార్పొరేషన్లుగా విభజించిన సంగతి తెలిసిందే. వాటితో పాటు వరంగల్, ఖమ్మం కార్పొరేషన్ లకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఐదు చోట్ల సత్తా చాటేందుకు పవన్ కళ్యాణ్ గట్టి ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా గ్రేటర్ లో సెటిలర్స్, ఉద్యోగులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో బరిలో దిగితే మంచి ఫలితాలు వస్తాయని భావిస్తున్నట్లు సమాచారం. అంతర్గతంగా అభ్యర్థుల ఎంపిక కోసం ఇప్పుడు ఈ కార్యాలయాన్ని ప్రారంభించినట్లు అర్థం అవుతోంది. ఏపీ మాదిరిగానే తెలంగాణలో సైతం సుదీర్ఘకాలం రాజకీయం చేసి పట్టు సాధించాలన్నది పవన్ కళ్యాణ్ ఆలోచన..

**రాజకీయ శూన్యతను ఉపయోగించుకోవాలని..**

గతంతో పోల్చుకుంటే ప్రత్యేక రాష్ట్ర సెంటిమెంట్ అనేది తెలంగాణలో సన్నగిల్లింది. అదే సమయంలో ఒక రకమైన రాజకీయ శూన్యత ఏర్పడింది. నవ తెలంగాణను పాలించే ఛాన్స్ ఇచ్చిన గులాబీ పార్టీ అవినీతిలో కూరుకుపోయింది. కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇస్తే కొన్ని వర్గాలకు ఆకట్టుకోలేకపోతోంది. భారతీయ జనతా పార్టీకి సరైన నాయకత్వం లేదు. ఈ పరిస్థితుల్లోనే ఏపీ మాదిరిగా సుదీర్ఘ రాజకీయం చేసిన నిలబడితే తెలంగాణ ప్రజలు కూడా ఆదరిస్తారని పవన్ కళ్యాణ్ ఒక అంచనాకు వచ్చారు. అందుకే అక్కడ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు.

# కొడాలి నాని అరెస్ట్!

వర్గాల్లో ఆసక్తికర చర్చ నడుస్తోంది. వైసిపి హయాంలో కొడాలి నాని వ్యవహరించిన తీరుపై కేసులు నమోదయ్యాయి. ఈ మేరకు విచారణకు తాజాగా కూటమి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వైసిపి అధికారంలో ఉన్న సమయంలో చంద్రబాబుతో సహా నాటి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ పై కొడాలి నాని అనుచిత వ్యాఖ్యలు చేశారు. వీటిపై కేసు కూడా నమోదయింది. ఇప్పుడు ఈ కేసులో నాని ప్రాసిక్యూషన్కు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీంతో కొడాలి నాని అరెస్టు తప్పదన్న ప్రచారం పొలిటికల్ వర్గాల్లో బలంగా నడుస్తోంది.

**అప్పట్లో దూకుడుగా..**

వైసిపి హయాంలో దూకుడుగా వ్యవహరించారు కొడాలి నాని. ముఖ్యంగా చంద్రబాబుతో పాటు లోకేష్ పై వ్యక్తిగత దాడి చేసేవారు. 2021లో పంచాయితీ ఎన్నికలు జరిగాయి రాష్ట్రంలో. ఆ సమయంలో కొడాలి నాని చేసిన వ్యాఖ్యలపై కేసులు నమోదయ్యాయి. అప్పటి ప్రతిపక్ష నేతతో పాటు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ పై హాట్ కామెంట్స్ చేశారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘించే విధంగా వ్యవహరించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం సంయుక్త కార్యదర్శి అప్పటి కృష్ణా జిల్లా ఎస్పీకి నివేదిక పంపారు. ఆ నివేదిక ఆధారంగా 2021 లోనే స్థానిక న్యాయస్థానం అనుమతి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే అప్పటికే రాష్ట్రమంత్రిగా ఉన్న దృష్ట్యా ఆయన పై కేసు విచారణ చేపట్టాలంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. అందుకే పెండింగ్లో పెట్టారు. తాజాగా కృష్ణ జిల్లా కలెక్టర్ పంపిన నివేదికను పరిశీలించిన రాష్ట్ర హోంశాఖ ప్రాసిక్యూషన్కు అనుమతి మంజూరు చేసింది. ఈ మేరకు హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులు జారీ చేశారు.

**ఇటీవల యాక్టివ్..**

వాస్తవానికి కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే కొడాలి నాని అరెస్టు ఉంటుందన్న టాక్ నడిచింది. కానీ ఆయన నియోజకవర్గానికి దూరంగా ఉంటూ వచ్చారు. ఈ క్రమంలో ఆయన అనారోగ్యానికి గురయ్యారు. గుండెపోటుతో ముంబైలోని ఓ ఆసుపత్రిలో చేరారు. అక్కడ బైపాస్ సర్జరీ చేసుకున్న అనంతరం కొద్దిరోజులపాటు హైదరాబాద్ కి పరిమితం అయ్యారు. ఇటీవల యాక్టివ్ అయ్యారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. మరోవైపు కూటమి ప్రభుత్వంపై కూడా విమర్శలు చేయడం ప్రారంభించారు. ఈ పరిస్థితుల్లో ఆయనపై విచారణకు ప్రాసిక్యూషన్ అనుమతి రావడం పై అనుమానాలు తలెత్తుతున్నాయి. ఒక్క ఈ కేసు మాత్రమే కాదు చాలా కేసులు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. కొడాలి నాని అరెస్టు కాక తప్పదన్న టాక్ పొలిటికల్ వర్గాల్లో వినిపిస్తోంది.

# క్షేత్ర స్థాయిలో విస్తృతంగా పర్యటించండి

**ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు అందుబాటులో ఉండాలి**

**సెప్టెంబరు నాటికల్లా మొదటి విడత ఇండ్ల నిర్మాణాలు పూర్తి**

**హౌసింగ్ కార్పొరేషన్ ఎండి వి. పి. గౌతం**

**ఇందిరమ్మ ఇండ్ల పురోగతిపై ప్రాజెక్టు డైరక్టర్లు, ఎఇ లతో సమీక్ష**

హైదరాబాద్: నిరంతరం క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు అందుబాటులో ఉంటూ ఇంటి నిర్మాణాలు త్వరితగతిన పూర్తి జిల్లాల ప్రాజెక్టు డైరక్టర్లు, ఇంజనీరింగ్ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ శ్రీ వి.పి.గౌతం సూచించారు. అంతే కాకుండా రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా ప్రస్తుతం జరుగుతున్న సర్వేలో గ్రామ సమాఖ్యలతో సమన్వయం చేసుకోవాలని పూర్తి పారదర్శకంగా వివరాలను సేకరించాలని స్పష్టం చేశారు. హైదరాబాద్ లోని హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం నుంచి శుక్రవారం జిల్లాల ప్రాజెక్టు డైరక్టర్లు, డిప్యూటీ ఇంజనీర్లు, ఎఇలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది సెప్టెంబరు నాటికల్లా మొదటి విడతలో మంజూరైన ఇండ్లన్నీ పూర్తి అయ్యేలా, పకడ్బందీ ప్రణాళికతో పనిచేయాలన్నారు. ముఖ్యమంత్రి రేవంతరెడ్డి నిర్దేశించినట్లుగా మరో లక్ష ఇండ్ల గృహ ప్రవేశాలు జరిగేలా కృషి చేయాలన్నారు. ఇందుకోసం ఎఇలు నిరంతరం గ్రామాల్లో పర్యటిస్తూ, లబ్దిదారులు ఇండ్ల పనులను వేగవంతంగా పూర్తి చేసుకునేలా చైతన్య పరచాలని ఎండి గౌతం ఆదేశించారు.



# 'సాయి కృష్ణ' కేసులో వైసీపీకి షాక్!

జగన్ మోహన్ రెడ్డి ఏకంగా ఆ కుటుంబాన్ని పరామర్శించి కూటమి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేశారు. రాష్ట్రస్థాయి ఆందోళనలకు ప్రణాళిక వేశారు. దానికి చెక్ పెట్టారు సీఎం చంద్రబాబు.

**సింగపూర్ నుంచి వచ్చిన వెంటనే..**

ఈ ఘటన వెలుగులోకి వచ్చినప్పుడు సీఎం చంద్రబాబు సింగపూర్ లో ఉన్నారు. అక్కడ నుంచి రాష్ట్రానికి రాగానే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, పోలీసు ఉన్నతాధికారులతో కీలక చర్చలు జరిపారు. సర్కారును ఇరుకునపెట్టి, కుల రాజకీయంగా మలుచుకుని రాజకీయ లబ్ధి పొందాలనుకున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చంద్రబాబు ఊహించని షాక్ ఇచ్చారు. కాపు యువకుడు కావడంతో దీనిని ఒక రాజకీయ అస్త్రంగా మార్చుకోవాలని చూసింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. ఈ కేసు వ్యవహారంపై తక్షణమే స్పందించిన జగన్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సిబిఐతో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కాపు కార్డును తెరమీదకి తెచ్చి గట్టిగానే ప్లాన్ చేశారు. కులం రంగు పూసేసి కాపు నేతలను రంగంలోకి దించారు. కానీ ఆ ప్రయత్నాలను చంద్రబాబు తన చతురతతో చెక్ పెట్టేశారు. తనదైన శైలిలో బ్రేక్ వేశారు.

**బాధిత కుటుంబానికి భరోసా..**

ప్రధాన ప్రతిపక్షం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సామాజిక వర్గం కోణంలో ఆలోచన చేసి విమర్శలు చేస్తే.. చంద్రబాబుతో పాటు పవన్ ప్రభుత్వ పరంగానే చర్యల ద్వారా బాధిత కుటుంబంలో భరోసా నింపే ప్రయత్నం చేశారు. బాధలో ఉన్న సాయి కృష్ణ కుటుంబాన్ని వాదాచేందుకు హుటాహుటిన స్థానిక ఎమ్మెల్యేను వారి ఇంటికి పంపించారు. అది ఆ కుటుంబానికి భరోసా ఇచ్చింది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఐ నాగరాజును సస్పెండ్ చేసి.. అతనిపై హత్యాయత్నం సహా కట్టిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. విచారణకు ఎస్పీ స్థాయి అధికారిని నియమించారు. అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ దైవప్రసాద్ వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ధైర్యం చెప్పారు. దీంతో సాయి కృష్ణ కుటుంబం శాంతించింది. ప్రభుత్వంపై విశ్వాసాన్ని నమ్మకాన్ని వ్యక్తం చేసింది. అయితే ఏదో జరిగిపోతుంది అని నమ్మకం పెట్టుకున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఇది షాకింగ్ పరిణామమే.

# పాఠశాలల్లోనే దేశ భవిష్యత్



తెలంగాణ భాషా ప్రయుక్తరాష్ట్రంగానో, పాలనా సౌలభ్యం కోసమో ఏర్పడింది కాదని ఈసందర్భంగా అన్నారు. 60 ఏళ్ల సుదీర్ఘ పోరాటం, విద్యార్థుల ఆత్మబలిదానాలతో ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైంది. తెలంగాణ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు, ఉపాధి కోసం ఎంతోమంది త్యాగాలు చేశారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో ఉంది.. వాటిని పునరుద్ధరించాలన్నదే తన సంకల్పమని అన్నారు. విద్యాశాఖను గతంలో విధ్వంసం చేశారు. గత పాలకుల అరాచకంతో రాష్ట్రానికి వందేళ్ల నష్టం జరిగింది. తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీ రూపొందించి ప్రక్షాళన చేపట్టాం అని వివరించారు. విధ్వంసమైన విద్యాశాఖను వికాసం వైపు నడిపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం బడ్జెట్లో 8.5 శాతం నిధులు కేటాయించాం. వెనుకబడిన తరగతుల విద్యార్థుల కోసం రూ.26,600 కోట్లు ఖర్చు చేస్తున్నాం. వీటిని భావితరాల భవిష్యత్తును నిర్ణయించే పెట్టుబడులుగా భావిస్తున్నాం. ఆరుట్లలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్లో నో అడ్మిషన్ బోర్డు పెట్టారు. ప్రభుత్వ స్కూళ్లలో ఇలా బోర్డు పెట్టే పరిస్థితి వస్తుందని ఎవరూ ఊహించి ఉండరని అన్నారు. ఉద్యోగులకు జీతాల మాదిరిగానే ప్రతినెలా ఒకటో తేదీన విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీలు చెల్లిస్తున్నామని రేవంత్‌రెడ్డి అన్నారు. గతంలో హాస్టల్ విద్యార్థులకు ఈ ఛార్జీలు పెంచలేదని, తాము అధికారంలోకి వచ్చాక పెంచామని అన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్‌తో పాటు మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# క్వాంటం, డీప్‌టెక్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్

## ఆయా రంగాల్లో కేంద్రంగా అమరావతి

### ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ

అమరావతి: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి దూరదృష్టి, ఐటీ మంత్రి నారా లోకేశ్ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని క్వాంటం, డీప్‌టెక్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాలకు కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహన కృష్ణ తెలిపారు. శుక్రవారం రాజధాని అమరావతిలోని మేధా టవర్స్‌లో రాష్ట్రంలోనే తొలి క్వాంటం ఇంక్యుబేటర్‌ను చండీగఢ్ యూనివర్సిటీ ఎండీ జై ఇందర్ సింగ్ సందు, క్వాంటం వ్యాలీ డైరెక్టర్ శ్రీధర్‌తో కలిసి మోహన కృష్ణ ప్రారంభించారు. ఆవిష్కరణలు, స్టార్టప్‌ల ప్రోత్సాహంలో దేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొందిన చండీగఢ్ యూనివర్సిటీ భాగస్వామ్యంతో రాష్ట్ర యువతకు సువర్ణావకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. క్వాంటం ఇంక్యుబేటర్ ద్వారా విద్యార్థులు, పరిశోధకులు, స్టార్టప్‌లకు ప్రపంచ స్థాయి మెంటారింగ్, అత్యాధునిక క్వాంటం కంప్యూటింగ్ వనరులు, పరిశ్రమలతో అనుసంధానం, పెట్టుబడిదారులతో భాగస్వామ్య అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. క్వాంటం వ్యాలీ డైరెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ.. క్వాంటం టెక్నాలజీ భవిష్యత్తు ప్రపంచాన్ని నిర్దేశిరచే విప్లవాత్మక రంగమని అభివర్ణించారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ప్రపంచ స్థాయిలో రాణించాలని రాష్ట్ర యువతకు సూచించారు.

# టెలిగ్రామ్‌పై నిషేధం సబబే

న్యూఢిల్లీ: నీట్ రీ--ఎగ్జామ్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రముఖ మెసేజింగ్ యాప్ టెలిగ్రామ్‌పై తాత్కాలిక నిషేధం విధిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఢిల్లీ హైకోర్టు సమర్థించింది. పేపర్ లీకేజీలను నివారించేందుకు జూన్ 22 వరకు యాప్‌ను బ్యాన్ చేస్తూ కేంద్రం జారీ చేసిన ఆదేశాలను సవాల్ చేస్తూ టెలిగ్రామ్ సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం శుక్రవారం కొట్టివేసింది. జస్టిస్ తేజస్ కరియా సారథ్యంలోని ఏకసభ్య ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. విచారణ సందర్భంగా కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. టెలిగ్రామ్ యాప్‌లోని సాంకేతిక ఫీచర్ల ద్వారా ఆటోమేటెడ్ బాట్ అకౌంట్లను సృష్టించి, ఒకేసారి పెద్ద ఎత్తున సమాచారాన్ని బదిలీ చేసే అవకాశం ఉందన్నారు. ఒక బాట్‌ను బ్లాక్ చేస్తే, దానంతటదే మరో బాట్‌కు సమాచారం బదిలీ అయ్యే (మిర్రర్ ఛానల్) వ్యవస్థ ఇందులో ఉందని వివరించారు. 21న జరిగే నీట్ రీ--ఎగ్జామినేషన్ నేపథ్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ), కేంద్ర ఉన్నత విద్యా శాఖ సిఫార్సుల మేరకే తాత్కాలికంగా బ్లాక్ చేసినట్లు వివరించారు. అయితే, నీట్‌కు సంబంధించి చట్టవిరుద్ధంగా ఉన్న 900 పైగా లింకులను ఏఐ సాంకేతికత ద్వారా ఇప్పటికే తొలగించామని టెలిగ్రామ్ వాదించింది. కొందరు




చేసిన తప్పులకు 15 కోట్లకు పైగా ఉన్న సాధారణ యూజర్లను శిక్షించడం వారి హక్కులను హరించడమేనని పేర్కొంది. కేవలం ఒక వర్గానికి చెందిన అభ్యర్థులు పరీక్ష రాస్తున్నారనే కారణంతో, ఏ సంబంధం లేని 15 కోట్ల మంది సాధారణ యూజర్ల యాప్ వినియోగాన్ని ఎలా నిరోధిస్తారని ఈ సందర్భంగా ధర్మాసనం కేంద్రాన్ని మౌఖికంగా ప్రశ్నించింది. వాదనల అనంతరం టెలిగ్రామ్ పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు జస్టిస్ తేజస్ కరియా తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ఐటీ చట్టంలోని సెక్షన్ 69ఏ కింద ఒక సామాజిక మాధ్యమ వేదికను బ్లాక్ చేసే అధికారం కేంద్రానికి ఉందని స్పష్టం చేశారు. జరగబోయే నష్టాన్ని నివారించేందుకు కేంద్రం అనుసరించిన విధానంపై సంతృప్తి వ్యక్తం చేశారు.

# నేడు పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ!

(మొదటి పేజీ తరువాయి)

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ఏపీలో రైతులకు గుడ్ న్యూస్. పిఎం కిసాన్ తో పాటు అన్నదాత సుఖీభవ నిధులు ఖాతాల్లో జమ కానున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో తొలి విడత నిధులు చేసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద రూ.5,000.. కేంద్ర ప్రభుత్వం పిఎం కిసాన్ కింద రూ.2000.. కలిపి రూ.7000 చొప్పున జమ చేయనున్నాయి. గత ఏడాది అన్నదాత సుఖీభవ నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు రెండో ఏడాది కూడా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం విశేషం.




**పీఎం, సిఎం చేతుల మీదుగా..**

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వేరువేరుగా ఈ నిధుల జమకు సంబంధించి కార్యక్రమాలు నిర్వహించనున్నాయి. పిఎం కిసాన్ నిధులను పశ్చిమ బెంగాల్ లోని హుగ్లీ జిల్లా తారకేశ్వర్ లో ప్రధాని నరేంద్ర మోడీ విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా పీఎం కిసాన్ ఉత్సవ్ దివస్ ను నిర్వహించాలని కేంద్రం నిర్ణయించింది.. అన్నదాత సుఖీభవ నిధులను అదేరోజు పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం లింగం గుంట్ల గ్రామంలో సీఎం చంద్రబాబు విడుదల చేయనున్నారు. లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో పిఎం కిసాన్ తో పాటు మూడు విడతల్లో అన్నదాత సుఖీభవ నిధులను జమ చేశారు. ఈ ఏడాది కూడా అదే విధంగా నిధుల విడుదలకు సిద్ధమయ్యారు.

**భారీగా నిధులు..**

రాష్ట్రవ్యాప్తంగా 46,85,838 మంది రైతుల ఖాతాల్లో పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ నిధులు రూ.3125.47 కోట్లు జమ కానున్నాయి. రాష్ట్ర వాటా కింద రూ.2,342.92 కోట్లు, కేంద్ర ప్రభుత్వ వాటాగా రూ.782. 5 కోట్లు విడుదల కానున్నాయి. కాక పీఎం కిసాన్ పథకానికి ఈ కేవైసీ తప్పనిసరి. అర్హత ఉండి సాయం దక్కని వారి కోసం ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ కు అవకాశం ఇవ్వనున్నారు.

## సింగరేణిపై బిజెపి చిల్లర రాజకీయాలు

### అక్కడ పర్యటించే హక్కు ఆ నేతలకు లేదు

### ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ విమర్శలు

హైదరాబాద్: సింగరేణిపై బీజేపీ ఇకనైనా చిల్లర రాజకీయాలు మానుకోవాలని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ అన్నారు. సింగరేణి సంస్థపై మాట్లాడే నైతిక అర్హత గానీ, అక్కడ పర్యటించే హక్కు గానీ బీజేపీకి ఎంతమాత్రం లేదని ఆయన స్పష్టం చేశారు. బొగ్గు బ్లాకులను ప్రైవేటుపరం చేయాలని నిర్ణయించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నాయకత్వంలో పనిచేస్తున్న బీజేపీ నాయకులు.. ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని సింగరేణికి వెళ్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఈ చర్యల ద్వారా బీజేపీ ఎంతటి దౌర్భాగ్య స్థితిలో ఉందో స్పష్టంగా అర్థమవుతోందని ఎద్దేవా చేశారు. సింగరేణి సంస్థను దెబ్బతీసేందుకు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కలిసి కుట్రలు పన్నుతున్నాయని అద్దంకి దయాకర్ ఆరోపించారు. పైకి మాత్రం వేర్వేరుగా నటిస్తున్నప్పటికీ.. ఈ రెండు పార్టీలు రాజకీయ మిత్రులని విమర్శించారు. సింగరేణిని చుట్టుముట్టి ఇరు పార్టీలు చేస్తున్నవి కేవలం రాజకీయాలేనని మండిపడ్డారు.

# ఎంపీ వర్సెస్ ఎమ్మెల్యే!

(మొదటి పేజీ తరువాయి)

అయితే ఈసారి ఈ సీటు టిడిపి తీసుకుంటుందన్న ప్రచారం నడుస్తోంది. అదే జరిగితే కొత్త అభ్యర్థి రంగంలోకి దిగడం ఖాయం.

**హేమాహేమీలు ప్రాతినిధ్యం..**

1983 నుంచి 1999 వరకు వరుసగా ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి గెలిచారు ప్రతిభా భారతి. ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గంగా ఉన్న ఎచ్చర్లలో ఆమె అప్రతిహసంగా విజయం సాధిస్తూ వచ్చారు. అయితే 2004లో మాత్రం ఆమె ఓడిపోయారు. 2009 నుంచి ఎస్సీ కాస్త బీసీ జనరల్ గా మారింది. 2009లో మీసాల నీలకంఠం నాయుడు, 2014లో కిమిడి కళా వెంకట్రావు, 2019లో గొర్ల కిరణ్ గెలిచారు ఈ నియోజకవర్గం నుంచి. 2024 లో మాత్రం పొత్తులో భాగంగా బిజెపికి కేటాయించారు. ఆ పార్టీ అభ్యర్థిగా బరిలో దిగిన ఈశ్వరరావు విజయం సాధించారు.

**నాగబాబు సైతం దృష్టి..**

వచ్చే ఎన్నికల్లో ఈ సీటు టిడిపికి కేటాయిస్తారన్న ప్రచారం నడుస్తోంది. మరోవైపు జనసేన సైతం కర్చీఫ్ వేసిందన్న టాక్ ఉంది. మెగా బ్రదర్ నాగబాబు ఈ నియోజకవర్గంలో ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు ప్రచారం ఉంది. మరోవైపు తెలుగుదేశం ఈ సీటు తీసుకుంటే పోటీ చేసేందుకు సిట్టింగ్ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ప్రయత్నంలో ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. మొన్నటి ఎన్నికల్లో ఎచ్చెర్ల నియోజకవర్గం సీటు కేటాయించారు. కానీ వివిధ సమీకరణలో భాగంగా ఆయనకు ఎంపీగా అవకాశం ఇచ్చారు చంద్రబాబు. అనూహ్యంగా బిజెపికి ఈ సీటు కేటాయించారు. అయితే 2019 ఎన్నికల వరకు టిడిపిలో ఉండి.. ఆ పార్టీ ఓడిపోయిన తర్వాత బిజెపిలో చేరారు ఈశ్వరరావు. కమ్మ సామాజిక వర్గానికి చెందిన ఈశ్వరరావుకు బిజెపి హై కమాండ్ సీటు ఇచ్చింది. అప్పట్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా ఉన్న పురందేశ్వరి ఈ సీటు కేటాయించారు ఈశ్వరరావుకు. ఈసారి మాత్రం కలిశెట్టి అప్పలనాయుడు సీటు ఆశిస్తున్నారు. కానీ నడికుదుటి ఈశ్వరరావుకు మంత్రి నారా లోకేష్ తో మంచి సంబంధాలు ఉన్నాయి. అవసరం అనుకుంటే ఈశ్వరరావు టిడిపిలోకి వచ్చేందుకు సిద్ధమే అన్న ప్రచారం నడుస్తోంది. మొత్తానికి అయితే ఎన్నికలు ఇంకా మూడు సంవత్సరాలు ఉండగా.. ఎమ్మెల్యే టికెట్ కోసం ఇప్పటి నుంచే పోటీ ప్రారంభం కావడం విశేషం.

# అట్టహాసంగా యంగ్ ఇండియా వెల్‌కమ్ కిట్ల పంపిణీ

### విద్యార్థులతో డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించిన గవర్నర్

### వివిధ ప్రాంతాల నుంచి 15వేలమంది విద్యార్థుల హాజరు

### పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనుల, ప్రారంభోత్సవాలు

హైదరాబాద్: ఎల్బీ స్టేడియంలో యంగ్ ఇండియా వెల్కమ్ కిట్స్ పంపిణీ, డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులతో డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించడంతో పాటు కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. తెలంగాణ వ్యాప్తంగా రూ.50.73కోట్లతో క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి సీఎం రేవంత్ శ్రీకారం చుట్టారు. అందులో రూ.36.65కోట్లతో వివిధ జిల్లాల్లో మినీ స్టేడియాల నిర్మాణం, క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి శంకుస్థాపన చేశారు. రూ.14.08కోట్లతో గచ్చిబౌలి, ఎల్బీ స్టేడియాల్లో బాలబాలికల క్రీడా శిక్షణకు వివిధ అకాడమీలను రేవంత్ ప్రారంభించారు. రూ.10కోట్లతో రంగారెడ్డి జిల్లా కొందుర్గ్‌లో మినీ స్టేడియం నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. రూ.10కోట్లతో సంగారెడ్డిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియం ఆధునికీకరణకు కొబ్బరికాయ కొట్టారు. అలాగే రూ.4కోట్లతో నారాయణపేట్ జిల్లా నర్వలో మినీ స్టేడియం నిర్మాణానికి భూమిపూజ చేశారు. రూ.4కోట్లతో వనపర్తి జిల్లా ఆత్మకూర్‌లో మల్టీ పర్పస్ స్టేడియం, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో కోర్టుల నిర్మాణం, క్రికెట్ గ్రౌండ్, వాకింగ్ ట్రాక్ అభివృద్ధికి శంకుస్థాపన చేశారు. అలాగే రూ.3.50కోట్లతో కామారెడ్డి జిల్లా గాంధారి, రూ.2.65కోట్లతో మెదక్ జిల్లా నర్సాపూర్‌లో మినీ స్టేడియాలకు భూమిపూజ చేశారు. రూ.2.50కోట్లతో నారాయణపేట్ జిల్లా మక్తల్ మండలం ఉట్కూరులో వాలీబాల్, కబడ్డీ కోర్టుల నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టారు సీఎం రేవంత్. రూ.5.70 కోట్లతో బాలికల కోసం హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన ఈఎఈం తెలంగాణ టాలెంట్ అకాడమీ ప్రారంభం చేశారు. రూ.5.70 కోట్లతో బాలుర కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన ఈఎఈం తెలంగాణ టాలెంట్ అకాడమీ ప్రారంభించారు. రూ.35.95 లక్షలతో బాలికల కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన అథ్లెటిక్స్ అకాడమీ ప్రారంభం అయ్యింది. రూ.35.94 లక్షలతో బాలుర కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన అథ్లెటిక్స్ అకాడమీ ప్రారంభం చేశారు. రూ.44.50 లక్షలతో బాలికల కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన హాకీ అకాడమీ ప్రారంభం చేశారు. రూ.44.50 లక్షలతో బాలుర కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన హాకీ అకాడమీ ప్రారంభం అయ్యింది. రూ.58.50 లక్షలతో బాలుర కోసం ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఫుట్ బాల్ అకాడమీ ప్రారంభం చేశారు. రూ.49 లక్షలతో బాలుర కోసం ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన హ్యాండ్ బాల్ అకాడమీ ప్రారంభం అయ్యింది. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. మరోవైపు గురుకుల విద్యార్థులకు 22 రకాల వస్తువులు, హాస్టల్ విద్యార్థులకు 10, డే స్కాలర్లకు 7 రకాల విద్యా సామగ్రితో కిట్లను అందించారు. ఈ కార్యక్రమానికి సుమారు 15వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ చారిత్రాత్మక వేడుకకు రాష్ట్రంలోని ప్రభుత్వ బడులు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీలు), ప్రభుత్వ గురుకులాలు, విద్యా వసతి గృహాల నుంచి దాదాపు 15 వేల మంది విద్యార్థులు తరలివచ్చారు. విద్యార్థులు చదువుకునే విద్యాసంస్థల రకాన్ని బట్టి వారి అవసరాలకు తగినట్లుగా ఈ కిట్లను ప్రభుత్వం ప్రత్యేకంగా డిజైన్ చేసింది.

## వచ్చే ఎన్నికల్లో మళ్లీ బిఆర్ఎస్‌దే అధికారం



కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం ఖాయమని మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. నారాయణపేట జిల్లా కొడంగల్ రాఘవేంద్ర ఫంక్షన్ హాల్‌లో కొడంగల్ నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు , సర్‌పై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి సబితా ఇంద్రా రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పట్నం నరేందర్ రెడ్డి, మెతుకు ఆనంద్, కొప్పుల మహేష్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జెండాను మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ ఎగురవేసి కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఓటర్ల సవరణ జాబితా తయారి కార్యక్రమంలో ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త భాగస్వాములు కావాలని సూచించారు . దేశంలో అత్యధిక సభ్యత్వం కలిగిన పార్టీలలో బీఆర్ఎస్ ఒకటిగా నిలిచిందని తెలిపారు. పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ నాయకత్వంలో ప్రతి జిల్లాలో పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేయడంతో పాటు ఢిల్లీలో తెలంగాణ భవన్ నిర్మించారని గుర్తుచేశారు. భూమి ఉన్నంత వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజలతో కలిసి ఉంటుందని పేర్కొన్నారు. అభివృద్ధితో పాటు కార్యకర్తల సంక్షేమం, గౌరవం కూడా ముఖ్యమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన అనేక హామీల అమలులో విఫలమైందని ఆరోపించారు. రైతుబంధు, రుణమాఫీ, పెన్షన్ల పెంపు, బీసీ వర్గాలకు ఇచ్చిన హామీలు, గొల్ల కురుమల అభివృద్ధి పథకాల అమలుపై ప్రశ్నలు లేవనెత్తారు. రైతులు, మహిళలు, బలహీన వర్గాల సమస్యలను ప్రభుత్వం సమర్థవంతంగా పరిష్కరించడంలో విఫలమైందని విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులను పూర్తి చేయాలన్నారు. స్వంత జిల్లాకు అధిక నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ కార్యకర్తలపై వేధింపులు, అక్రమ కేసులను ఆపి, అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.



# ‘మూసీ’ ప్రాజెక్టుకు భారీ ముందడుగు!

అంత సులువైన పని కాదు.. సాధారణంగా దేశ రక్షణకు సంబంధించిన స్థలాలను.. రాష్ట్రాల ప్రాజెక్టుల కోసం సాధించడం అంత సులువైన పని కాదు. కానీ సీఎం రేవంత్ లాబీయింగ్ జరిపారు. రక్షణ శాఖతో నిరంతర సంప్రదింపులు కొనసాగించారు. దాని ఫలితంగానే ఈ సంక్లిష్టమైన అనుమతి లభించడం రాష్ట్ర రాజకీయాల్లో ఒక సరికొత్త పరిణామం. సీఎం రేవంత్ ప్రదర్శించిన మార్కు రాజకీయం తెలంగాణలో అభినందనలు అందుకుంటుంది. కేంద్ర రక్షణ శాఖ అనుమతులు జారీపై సీఎం రేవంత్ హర్షం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వేదికగా కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్నాథ్ సింగ్ కు, రక్షణ శాఖ అధికారులతో పాటు ఇండియన్ ఆర్మీకి కృతజ్ఞతలు తెలిపారు. రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ కు కృతజ్ఞతలు తెలిపిన సీఎం రేవంత్ రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పేరును కనీసం ప్రస్తావించలేదు.


**కిషన్ రెడ్డి పై విమర్శలు..**

మూసీ ప్రాజెక్టు విషయంలో గత కొన్నాళ్లుగా కాంగ్రెస్ వర్సెస్ బిజెపి అన్నట్టు పరిస్థితి ఉంది. ప్రధానంగా సీఎం రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రికి కిషన్ రెడ్డి మధ్య తీవ్రస్థాయిలో రాజకీయ యుద్ధం నడుస్తూ వచ్చింది. కిషన్ రెడ్డికి ఢిల్లీ స్థాయిలో పలుకుబడి లేదు. తెలంగాణ ప్రాజెక్టులకు కేంద్రం నుంచి నిధులు రప్పించడంలో ఆయన విఫలం అయ్యారు అంటూ రేవంత్ బహిరంగంగానే విమర్శలు చేస్తూ వచ్చారు ఇప్పుడు వచ్చిన అనుమతులు కూడా ఆయనకు సంబంధం లేదు అన్నట్టు ట్వీట్ చేశారు. ప్రాజెక్టులు రానప్పుడు అడ్డుకుంటున్నారని నిందలు మాత్రం వేస్తున్నారని కిషన్ రెడ్డి అనుచరులు ఇప్పుడు ఆవేదనతో ఉన్నారు. అయితే తెలంగాణ బిజెపితో సంబంధం లేకుండా తానే నేరుగా మాట్లాడి ప్రాజెక్టులు తెచ్చుకుంటున్నట్లు సంకేతాలు ఇస్తున్నారు రేవంత్ రెడ్డి. బాపు ఘాట్ వద్ద 200 ఎకరాల్లో 133 అడుగుల మహాత్మా గాంధీ విగ్రహం, మ్యూజియం, పీస్ సెంటర్తో నిర్మించబోయే గాంధీ సరోవర్ ప్రాజెక్టు శంకుస్థాపనకు రాజ్నాథ్ సింగ్ ను సీఎం రేవంత్ ఆహ్వానించారు. ఈ మొత్తం పరిణామంతో తెలంగాణ బిజెపి ఇరకాటంలో పడింది.

# గండిపేట భూకబ్జా కేసు

### షరతులతో బ్రహ్మనాయుడికి బెయిల్

హైదరాబాద్,జూన్19: గండిపేట భూకబ్జా కేసులో వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడికి బెయిల్ మంజూరు అయ్యింది. ఆయనకు రంగారెడ్డి కోర్టు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది. ప్రతి 15 రోజులకు ఒకసారి నార్సింగ్ పోలీస్ స్టేషన్‌లో వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని ఆదేశాలు జారీ చేసింది. రూ.20 వేల చొప్పున రెండు ష్యూరిటీలు సమర్పించాలని రంగారెడ్డి న్యాయస్థానం ఆదేశించింది. ఈ కేసులో సాక్షులను, విచారణను ప్రభావితం చేసే విధంగా ప్రవర్తించవద్దని షరతుల్లో పేర్కొంది. ఫేక్ జీవో కేసులో ఇప్పటికే ఈవోడబ్ల్యూ పోలీసులు మూడు రోజుల పాటు బొల్లా బ్రహ్మనాయుడిని కస్టడీలోకి తీసుకుని విచారించారు. కస్టడీ ముగిసిన తర్వాత ఆయనను జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించారు. తనకు బెయిల్ మంజూరు చేయాలంటూ బొల్లా బ్రహ్మనాయుడు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వాదనలు ముగిసిన అనంతరం మాజీ ఎమ్మెల్యేకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. అయితే, కస్టడీలో మాజీ ఎమ్మెల్యే సరైన సమాధానాలు చెప్పలేదని, ఏ ప్రశ్నలు అడిగా తనకు తెలీదని మాత్రమే చెప్పారని, తాము ఆశించిన స్థాయిలో విచారణకు సహకరించలేదంటూ న్యాయస్థానం దృష్టికి పోలీసులు తీసుకెళ్లారు. కస్టడీ పూర్తి అయినందుకు బెయిల్ పొందేందుకు అర్హుడే అంటూ బొల్లా బ్రహ్మనాయుడు తరఫు న్యాయవాదులు వాదించారు. దీంతో మాజీ ఎమ్మెల్యేకు రంగారెడ్డి జిల్లా కోర్టు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది.


GHMC
hmda Growing Global
TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com

SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

# సమగ్ర పంటల విధానమే మేలు!


**దేశంలో పంటల విధానంపై సమగ్రత లోపించింది. రైతులు తమకు తోచిన పంటలు వేస్తున్నారు. ధరల కోసం దేబురిస్తున్నారు. ప్రభుత్వాలు వీలైనంత మేరకు కొంటున్నాయి. వీలుకాకపోతే చేతులెత్తేస్తున్నాయి. ముఖ్యంగా వరి, జొన్న, మక్కజొన్నలనే పండించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికే దేశంలో ధాన్యం బాగా పోగయ్యింది.**

డిమాండ్ ఉన్న పంటలు వేయడం, సేంద్రియం వైపు మళ్లడంలో రైతులు ఇప్పటికీ వెనకడుగు వేస్తున్నారు. దీంతో సంప్రదాయ వరి పండిస్తూ చేతులు కాల్చుకుంటున్నారు. ఈ విధానం ముందుగా పోవాలి. ప్రభుత్వాలు కూడా రైతులను చైతన్యం చేయడం లేదా, ఫలానా పంటలు వేయండి అని చెప్పడం లేదు. తెలంగాణ రైతుల పరిస్థితి తీసుకుంటే ఇదే అర్థం అవుతోంది. సన్నాలు పండించిన వారికి గిట్టుబాటు ధరలు వస్తున్నాయి. మద్దతు ధరలను మించి కొంటున్నారు. తాజాగా మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మార్కెట్ యార్డులో సన్న వడ్లకు డిమాండ్ పెరిగింది. వరుసగా రెండ్రోజుల నుంచి 3వేలకు పైగానే మద్దతు ధరలు దక్కుతున్నాయి. ప్రభుత్వం కూడా సన్నాలు పండించాలని, ఏడు రకాలను తాజాగా గుర్తించింది. కానీ మండలాల వారిగా రైతులతో మాట్లాడి వారిని ఒప్పించి, రైతుల పంటల విధానంలో మార్పులు తీసుకుని రావాల్సి ఉంది. ఇవన్నీ ఒక ఎత్తయితే కేంద్రం కూడా ధాన్యం మొత్తాన్ని కొనడానికి ముందుకు రావడం లేదు. టార్గెట్లు విధించి, ఆమేరకు ధాన్యం సేకరణకు రాష్ట్ర ప్రభుత్వాలకు చెబుతోంది. గతంలో బిఆర్ఎస్ అధికారంలో ఉండగా ఇలాగే జరిగింది. ఢిల్లీలో కూడా బిఆర్ఎస్ అధినేత, ఆనాటి సిఎం కెసిఆర్ ధర్నాకు దిగారు. అయినా నేటికీ మార్పు రాలేదు.

అందువల్ల రాష్ట్రాలు తమకుతాముగా సమగ్ర పంటల విధానం అమలు చేయాలి. కేవలం ఉచిత విద్యుత్, రైతుభరోసా డబ్బులు వేస్తే సరిపోదు. ఏ పంటలు వేయాలో, వాటికి మార్కెటింగ్ ఎలా ఉంటుందో తెలియచేయాలి. ప్రభుత్వాల జోక్యం లేకుండానే రైతులు పంటలు అమ్ముకునే పరిస్థితిని తీసుకుని రావాలి.ఇక విషయానికి వస్తే ఖరీఫ్ ముంచుకొస్తున్న వేళ రబీ పంటల కొనుగోళ్లు ఇంకా సాగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో పంటల కొనుగోళ్లపై కాంగ్రెస్ సర్కార్ చేతులెత్తేసింది. రైతులు పండించిన చివరి గింజ వరకు కొంటామంటూ చెబుతూ వచ్చిన మంత్రులు, ఇప్పుడు ఊహించని రీతిలో ప్రకటన చేశారు. ధాన్యం, మక్కజొన్న, జొన్న, కందులు, పెసర్లు.. ఇలా పంట ఏదైనా సరే ఇక రాష్ట్ర ప్రభుత్వం తరఫున పంటలు కొనుగోలు చేసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది. కేంద్ర ప్రభుత్వం ఎంత కొనాలని చెబితే అంతే కొంటామని, అంతకుమించి గింజ కూడా ఎక్కువ కొనేది లేదని స్పష్టంచేసింది. గురువారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఇన్‌ఫార్మల్ క్యాబినెట్ సమావేశంలో పంటల కొనుగోళ్లపై సంచలన నిర్ణయం తీసుకున్నది. ధాన్యం, మక్కలు, జొన్నలు, కందులు, పెసర్లు ఇలా పంటల కొనుగోళ్ల బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపైకి నెట్టేసింది. రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే ఏ పంటనైనా సరే కేంద్రం నిర్దేశించిన కోటా మేరకే కొనుగోలు చేస్తామని మంత్రి ఉత్తమ్ మీడియాకు చెప్పారు. పంటలకు మద్దతు ధరను కేంద్రమే నిర్ణయిస్తుంది కాబట్టి.. పంటల కొనుగోలు బాధ్యత కూడా కేంద్ర ప్రభుత్వానిదేనని అన్నారు. మంత్రి వ్యాఖ్యల నేపథ్యంలో ఇకపై రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయబోదనేది సుస్పష్టం. కేంద్రం కొనుగోలు చేస్తామని చెప్పిన పంటలను, కేంద్రం ఇచ్చిన కోటా మేరకే ఇక్కడ కేంద్రం ఇచ్చిన డబ్బులతో రైతుల నుంచి సేకరించి కేంద్రానికి అందిస్తుంది. అంతేగానీ ఒకవేళ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన కోటాకు మించి పంటలు ఉత్పత్తి అయితే ఆ పంటలను రాష్ట్ర ప్రభుత్వం తన సొంత నిధులతో కొనుగోలు చేయబోదు. పంటల కొనుగోళ్లలో కేంద్రం కోటా పూర్తికాగానే ఆ కేంద్రాలను మూసివేస్తుంది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యంతో పాటు ఇతర పంటలు ఉన్నా ఇక నుంచి ప్రభుత్వం పట్టించుకోదు. మొత్తంగా ఇదే విషయం అర్థం అవుతోంది. ఇలాంటి సమయంలో ఏం చేయాలన్నది కూడా ప్రభుత్వం ప్రకటించాలి. ఎంతమేరకు వరి వేయాలో, అదికూడా ఏ రకం వేయాలో రైతులకు చెప్పాలి. ఏయే జిల్లాల్లో వరి వేయాలో, వేయకూడదో కూడా నిర్ణయించాలి. నిజానికి ధాన్యం సేకరణ బాధ్యత కేంద్రానిదే. కేంద్రం ఆదేశాల మేరకే రాష్ట్రాలు ధాన్యం సేకరణ చేసి, ఎఫ్‌సిఐకి అప్పగిస్తుంది. ఈ క్రమంలో ఃాష్ట్రంలోని వివిధ పంటలను కేంద్ర ప్రభుత్వం కొంత మేరకే కొనుగోలు చేస్తుంది. ఉత్పత్తి అయిన ధాన్యంలో మూడో వంతు మాత్రమే కొంటుంది. ఇక పెసర్లు, కందులు, జొన్నలు, సన్‌ఫ్లవర్, సోయాబీన్ వంటి పంటలను మొత్తం ఉత్పత్తిలో 25శాతం మాత్రమే కొనుగోలు చేస్తుంది. ఒకవేళ కేంద్ర ప్రభుత్వానికి అవసరముండి, పంట ఎక్కువగా ఉంటే మరో 5-10శాతం వరకు కొనుగోలుకు అనుమతి ఇస్తుంది. ఒత్తిడి తెచ్చినర రాష్ట్రాలకే ఈ వెసులబాటు ఉంటుంది. ఇకపోతే కేంద్ర ప్రభుత్వం.. మక్కలను మాత్రం అసలే కొనుగోలు చేయదు. ఎంత ఉత్పత్తి అయినా సరే ఒక్క గింజ కూడా కొనుగోలు చేయదు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం తన కోటా కింద కొనుగోలు చేయగా మిగిలిన పంటలను కొనుగోలు చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదే. కేంద్రం తన కోటా మేరకు కొనుగోలు చేసిన తర్వాత మిగిలిన పంట ఉత్పత్తులను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు నిరాకరిస్తే రైతులు ఏం కావాలన్నది ఆలోచన చేయాలి. అందువల్ల పంటల విధానం అమల్లోకి రావాలి. ఏయే పంటలు వేయాలో, ఎంత విస్తీర్ణంలో వేయాలో ప్రభుత్వం నిర్ణయించాలి. అందుకు తగ్గట్లుగా ఎరువుల,విత్తనాలు సరఫరాచేసి, ఆయా పంటలనే ప్రోత్సహించడం ద్వారా సంక్షోభాన్ని అధిగమించవచ్చు.

# భయరహిత ఆలోచనే సృజనాత్మకతకు మూలం

**మనిషి మనసు అనేది అపారమైన, అనంతమైన సాగరం వంటిది. దాని నిగూఢ లోతుల్లో ఎన్నో అద్భుతమైన ఆలోచనలు, సరికొత్త కల్పనలు, అసాధారణమైన సృజనాత్మక శక్తులు నిద్రపోతూ ఉంటాయి. కానీ అనేకసార్లు, ఆ మనోసాగరపు అలలు తీరాన్ని చేరుకోకముందే, ఒక అదృశ్య శక్తి వాటిని మధ్యలోనే ఆపేస్తుంది. ఆ అదృశ్య శక్తే భయం. సమాజం నన్ను చూసి ఏమనుకుంటుందో అన్న భయం, ఒకవేళ ప్రయత్నిస్తే పరాజయం వస్తుందేమోనన్న భయం, అసలు ఇది నా వల్ల సాధ్యమవుతుందా? అన్న ఆత్మసంశయం ఇవన్నీ కలిసి ఒక సాధారణ మనిషిలోని మేధావిని, ఒక సృష్టికర్తను, ఒక గొప్ప సాహసిని నిద్రపుచ్చుతాయి. ఈ ఆధునిక కాలపు నేపథ్యంలో భయరహిత ఆలోచనలే సృజనాత్మకతకు అసలైన మూలం అన్న పరమ సత్యాన్ని మనం తెలుసుకోవడం, జీవితంలో అలవర్చుకోవడం అత్యవసరం.**



చరిత్ర పుటలను ఒకసారి వెనక్కి తిరగేస్తే, ఈ ప్రపంచ గమనాన్ని మార్చిన ప్రతి ఆవిష్కర్తా, ప్రతి గొప్ప కళాకారుడూ, ప్రతి అద్భుత నేతా ఒక ముఖ్యమైన సంగతిని సాధారణంగా పంచుకుంటారు వారు ఎన్నడూ భయాన్ని తమ మార్గంలో అడ్డంగా నిలబడనివ్వలేదు. మహాత్మాగాంధీ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మన ప్రియతమ శాస్త్రవేత్త ఎ.పి.జె. అబ్దుల్ కలామ్ వీరందరూ తమ తమ కాలాల్లో సమాజం నిర్దేశించిన కట్టుబాట్లను, హద్దులను దాటి సరికొత్తగా ఆలోచించారు. లోకం ఏమనుకుంటుందో అన్న భయాన్ని పూర్తిగా పక్కన పెట్టి, తమ అంతరాత్మ చెప్పిన దారినే నడిచారు. ఆ నిర్భయ ఆలోచనే వారిని చరిత్ర పుటల్లో చిరస్మరణీయులుగా నిలిపింది. మనస్తత్వ శాస్త్రవేత్తలు, నరాల నిపుణులు చెప్పే దాని ప్రకారం, భయం అనేది మనిషి మెదడులోని అమిగ్డలా అనే భాగాన్ని తీవ్రంగా క్రియాశీలం చేస్తుంది. ఈ ప్రత్యేక స్థితిలో మానవ మెదడు కేవలం పోరాడు లేదా పారిపో అనే అత్యవసర మోడ్‌లోకి వెళ్ళిపోతుంది. కానీ సృజనాత్మకత, నవ్య కల్పనలు, వినూత్న ఆలోచనలు ఇవన్నీ నిరాటంకంగా, ప్రశాంతంగా, స్వేచ్ఛగా ఆలోచించినప్పుడే సాధ్యమవుతాయి. నిరంతరం భయంలో మునిగిన మనసు కేవలం తన రక్షణ గురించి మాత్రమే ఆలోచిస్తుంది, అంతేకానీ సరికొత్త సృష్టి గురించి ఆలోచించలేదు.నిర్భయ ఆలోచన అంటే అజాగ్రత్తతో, బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించడం కాదు. అది అహంకారంతో, అవివేకంతో గుడ్డిగా ముందుకు దూకడం అంతకన్నా కాదు. నిర్భయ ఆలోచన అంటే ఒకవేళ తప్పు జరుగుతుందేమో అన్న సంకోచాన్ని, సందేహాన్ని అధిగమించి, కనీసం ప్రయత్నించే ధైర్యాన్ని పెంచుకోవడం. ఏమవుతుందో చూద్దాం అన్న సానుకూల మనోభావంతో, ఫలితంపై అతిగా అంచనాలు పెట్టుకోకుండా, చేస్తున్న పనిలో పూర్తి నిమగ్నతతో సృజించడం.ప్రముఖ తెలుగు రచయిత, సంస్కర్త గురజాడ అప్పారావు గారు నాటి రోజుల్లో కన్యాశుల్కం నాటకం రాసినప్పుడు, సాంప్రదాయ సమాజం ఎలా స్పందిస్తుందో అన్న భయాన్ని పక్కన పెట్టి, చేదు నిజాన్ని నిర్భయంగా సమాజం ముందు ఉంచారు. విశ్వకవి రవీంద్రనాథ్ టాగోర్ తన విశ్వజనీన రచనల్లో, శ్రీ రామానుజాచార్యులు తన విశిష్ట తత్వంలో, ఆచార్య నాగార్జునుడు తన శూన్యవాద తర్కంలో అందరూ నిర్భయంగా ఆలోచించారు. ఆ విప్లవాత్మక ఆలోచనలే నేటికీ వారికి అజరామర కీర్తిని తెచ్చిపెట్టాయి.భయాన్ని ఒక్కరోజులోనే పూర్తిగా జయించడం ఎవరికీ సాధ్యం కాదు. అది నిరంతర సాధనతో, ప్రతిరోజూ చిన్న చిన్న అడుగులు వేయడం ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది.మొదటగా, మనల్ని లోలోపల వేధిస్తున్న భయాలను స్పష్టంగా గుర్తించాలి. నాకు ఏది భయంగా ఉంది? ఆ భయం వెనుక ఏ నమ్మకం దాగి ఉంది? అని మనల్ని మనం ప్రశ్నించుకోవాలి. అప్పుడు అది వాస్తవికమైనదా లేక కేవలం మన కల్పితమా అని అర్థమవుతుంది. రెండవది విఫలత్వాన్ని మన స్నేహితుడిగా చేసుకోవడం. విజయమే చివరి గమ్యం కాదు, విఫలత అనేది అవమానం కాదు. థామస్ ఎడిసన్ విద్యుత్ బల్బు కనుగొనడానికి దాదాపు 10,000 పైగా విఫల ప్రయత్నాలు చేశారు. ప్రతి ప్రయత్నం తర్వాత ఆయన నేను ఓడిపోలేదు, ఇది పని చేయని మరో మార్గాన్ని కనుగొన్నాను అని మాత్రమే అన్నారు. ఆ దృక్కోణం భయాన్ని కరిగిస్తుంది.మూడవది ఇప్పుడు అన్న క్షణంలో బతకడం. మనం ఉన్న క్షణంలో పూర్తిగా నిమగ్నమైనప్పుడు, భూతకాల వైఫల్యాల భయం కానీ, భవిష్యత్ సంభావ్య ప్రమాదాల ఆందోళన కానీ మనసును ఆవరించవు. బౌద్ధ తత్వం చెప్పే మైండ్‌ఫుల్‌నెస్ అన్న సిద్ధాంతం ఇదే. వర్తమానంలో ఉన్నప్పుడే సృజనాత్మకత ఊపందుకుంటుంది. సృజనాత్మకత అన్న మాట వినగానే చాలామందికి కేవలం పెద్ద పెద్ద కళాకారులు, రచయితలు, సంగీతకారులు మాత్రమే గుర్తొస్తారు. కానీ అది చాలా పరిమితమైన అర్థం. వంట గదిలో ఒక గృహిణి సరికొత్త వంటకాన్ని ధైర్యంగా ప్రయత్నించినప్పుడు, ఒక రైతు పొలంలో కొత్త పద్ధతిలో పంట వేసినప్పుడు, ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సంక్లిష్ట సమస్యకు అనూహ్యమైన పరిష్కారం చూపించినప్పుడు అది కూడా గొప్ప సృజనాత్మకతే. అందులో కూడా కచ్చితంగా భయరహిత ఆలోచన అవసరం.తెలుగు రాష్ట్రాల్లో ఈనాడు పల్లె టూళ్ళ నుండి మహానగరాల వరకు అనేకమంది యువ పారిశ్రామికవేత్తలు, స్టార్టప్ స్థాపకులు, సమాజ సేవకులు ఎంతోమంది కనిపిస్తున్నారు. వారంతా ఒక ముఖ్యమైన సంగతిలో ఒకేలా ఉన్నారు వారంతా తమ వినూత్న ఆలోచనను బలంగా నమ్మారు, అంతర్గత భయాన్ని జయించారు, నిశ్చయంతో ముందుకు నడిచారు. అందుకే విజయం వారిని వరించింది. ఇది కేవలం ఒక వ్యక్తిగత విజయం మాత్రమే కాదు, మొత్తం సమాజానికి ఒక గొప్ప ప్రేరణ.మన విద్యావ్యవస్థ సమాజంలో ఒక పెద్ద బాధ్యతను భుజాన వేసుకుని ఉంది. పిల్లలకు కేవలం పుస్తకాల్లోని పాఠ్యాంశాలు, మార్కులు నేర్పించడం ఎంతమాత్రం సరిపోదు,వారిలో స్వతంత్రంగా, నిర్భయంగా ఆలోచించే సామర్థ్యాన్ని చిన్నతనం నుంచే పెంచాలి.మన విద్యావ్యవస్థలో మార్పు అనేది తరగతి గదిలో మనం మాట్లాడే తీరు నుంచే ప్రారంభం కావాలి. కేవలం పుస్తకంలో ఉన్న సరైన సమాధానం మాత్రమే చెప్పు అంటూ విద్యార్థులపై ఒత్తిడి పెంచే పాత పద్ధతి స్థానంలో, అసలు ఈ విషయంపై నువ్వు ఏమనుకుంటున్నావు? అని వారి స్వంత ఆలోచనలను ప్రోత్సహించే సరికొత్త వాతావరణం రావాలి. అలాగే, ఒక విద్యార్థి తప్పు చేసినప్పుడు నువ్వు తప్పు చేశావు అని అందరి ముందూ గద్దించి వారి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసే బదులు, పర్వాలేదు, మళ్ళీ ఒకసారి ప్రయత్నించు అని ఉపాధ్యాయులు ప్రేమగా ధైర్యం చెప్పినప్పుడే పిల్లల్లో భయం పోయి, అద్భుతమైన సృజనాత్మకత పెంపొందుతుంది.ఫిన్లాండ్ దేశపు విద్యావ్యవస్థను నేడు ప్రపంచమంతా ఆదర్శంగా తీసుకుంటుంది. అక్కడ పిల్లలపై పరీక్షల ఒత్తిడి చాలా తక్కువ, కానీ ఉపాధ్యాయులను ప్రశ్నించే స్వేచ్ఛ ఎక్కువ. ఫలితంగా ఆ దేశపు పిల్లలు ప్రపంచంలోనే అత్యంత సృజనాత్మకంగా ఆలోచించేవారిలో అగ్రస్థానంలో లెక్కింపబడుతున్నారు. మన తెలుగు రాష్ట్రాల్లో కూడా ఇలాంటి విశాల దృక్పథంతో విద్యావ్యవస్థలో తక్షణ మార్పులు తీసుకురావాలి.మన తెలుగు సంప్రదాయంలో నిర్భయ ఆలోచనకు, భావప్రకటన స్వేచ్ఛకు ఎలాంటి లేమీ లేదు. శతాబ్దాల క్రితమే అన్నమయ్య భగవంతుని అంతరంగాన్ని గురించి ఎంతో నిర్భయంగా కీర్తించారు నాటి రాజులను, అహంకారులైన పండితులను సైతం ధిక్కరించి పరమ సత్యాన్ని చాటారు. భక్త పోతన సంస్కృత పాలితులైన ఆస్థాన ప్రభువుల ఆశ్రయాన్ని నిక్కచ్చిగా తిరస్కరించి, స్వచ్ఛమైన తెలుగులో భాగవతాన్ని రాసి ప్రజల హృదయాల్లో నిలిచారు. యోగి వేమన తన ఆటవెలది పద్యాలలో సమాజంలోని మూఢాచారాలపై నిప్పులు చల్లే నిఖార్సైన మాటలు చెప్పారు ఎలాంటి ప్రాణ భయమూ లేకుండా ఇవన్నీ నేటి తరానికి చెప్పే స్పష్టమైన సందేశం ఏమిటంటే నిర్భయత అనేది మన రక్తం లోనే ఉన్న వారసత్వం. భయం అనేది కేవలం బయట నుండి వచ్చింది, బహుశా సుదీర్ఘ వలసపాలన వల్ల, సామాజిక అణచివేత వల్ల మనకు అలవడింది. ఆ కృత్రిమ భయాన్ని పూర్తిగా వదిలించుకుని, మన పూర్వికుల నిర్భయ ఆలోచనా పరంపరను తిరిగి పున:జీవింపజేయడమే నేటి యువతరం యొక్క ప్రధాన అవసరం.మనం ఏ రంగంలో ఉన్నా, సమాజంలో ఏ స్థాయిలో ఉన్నా ప్రతి ఒక్కరికీ నిర్భయంగా ఆలోచించడం ఖచ్చితంగా సాధ్యమే. అందుకు ఒక్క చిన్న కార్యాచరణ చాలు ,ఈ రోజు, ఇప్పుడే, మీ మనసులో చాన్నాళ్ళుగా నలుగుతున్న ఆ ఒక్క వినూత్న ఆలోచనను భయంతో ఎక్కడో మూలన పడేసిన ఆ కల, ఆ కొత్త ప్రాజెక్టు, ఆ ముఖ్యమైన నిర్ణయం దాన్ని ధైర్యంగా బయటకు తీయండి. దాని సాకారం గురించి ఈరోజే ఒక చిన్న అడుగు ముందుకు వేయండి. ఆ ఒక్క అడుగే మీలోని అపరిమిత సృజనాత్మకతను మేల్కొలుపుతుంది.గుర్తుంచుకోండి.ఈ సుదీర్ఘ ప్రపంచంలో మన జ్ఞాపకాలను శాశ్వతంగా నిలిపే అద్భుత విషయాలు ఒక సరికొత్త హృదయపూర్వక పాట, ఒక అందమైన కవిత, మానవాళికి మార్పు తీసుకొచ్చే ఒక కొత్త ఆవిష్కరణ, సమాజ గమనాన్ని ప్రభావితం చేసే ఒక గొప్ప సామాజిక కదలిక వీటన్నిటి వెనుక నిశ్చయంగా ఒకే ఒక్క నిర్భయ ఆలోచన ఉంటుంది. మీ ఆలోచన కూడా భవిష్యత్తులో అలాంటిదే అవుతుంది మీరు మీ మనసులోని భయాన్ని పూర్తిగా వదిలి, ఆత్మవిశ్వాసంతో ముందుకు నడిచినప్పుడు.



డా .సూర్యదేవర రామకృష్ణ,
9490754169

# కేంద్రానిది అప్పుడూ,ఇప్పుడూ మొండివైఖరే

ధాన్యం కొనుగోళ్లలో బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కూడా కేంద్రం కక్షపూరితంగా వ్యవహరించిందని, అయినా ఆనాటి సిఎం కెసిఆర్ ఏనాడూ రైతులకు అన్యాయం చేయలేదని, మాజీమంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. రైతులకు అండగా నిలిచి ఊరూరా కొనుగోలు కేంద్రాలతో పంటలు కొనుగోలు చేయించిన ఘనత కెసిఆర్‌దని అన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఉత్పత్తి అయిన మొత్తం ధాన్యంలో 3వ వంతు, ఇతర పంటల్లో 25శాతం కొనుగోలు చేయడం ఇప్పుడే అమలుచేసిన కొత్త విధానం కాదు. నాడు బీఆర్ఎస్ సర్కార్ హయాంలోనూ కేంద్ర ప్రభుత్వం ఇదే వైఖరిని అవలంబించింది. రాష్ట్రంలో రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయబోమని అనేక ఇబ్బందులకు గురిచేసింది. ఒక దశలో అప్పటి సీఎం కేసీఆర్ ఏకంగా కేంద్ర ప్రభుత్వంపై తెలంగాణ రైతుల తరఫున పెద్ద పోరాటమే చేశారు. అయినప్పటికీ కేంద్రం తెలంగాణ రైతుల పట్ల తన వివక్షను వీడలేదని గుర్తు చేశారు. ఉత్పత్తి అయిన మొత్తం పంటను కేంద్రమే కొనుగోలు చేయాలని తామూ పోరాడామని అన్నారు. కేంద్రం నిరాకరించినా రాష్ట్రం ముందుకు వచ్చి ధాన్యం సేకించిందని వేముల అన్నారు.కానీ ప్రస్తు రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేదని చెబుతున్నది. ఈ నేపథ్యంలో ఓ వైపు కేంద్రం 25శాతం పంటల్ని మాత్రమే కొనుగోలు చేయడం, మిగిలిన పంటను కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిరాకరిస్తుండటంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరకంగా మారింది. పంటల కొనుగోళ్లపై ఇటు రాష్ట్రం, అటు కేంద్రం చేతులెత్తేస్తుండటంతో మిగిలిన పంట పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. మిగిలిన పంటను రైతులు ఎక్కడ అమ్ముకోవాలనే ప్రశ్నలు ఉత్పత్తి అవుతున్నాయి. బహిరంగ మార్కెట్లో విక్రయిద్దామంటే మద్దతు ధర దక్కే పరిస్థితి లేదు. తప్పని పరిస్థితుల్లో విక్రయించిన రైతులు నష్టాలు మూటగట్టుకుంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతువ్యతిరేక చర్యలతో ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఉత్పత్తుల విక్రయం దైవాధీనంగా మారిందని అన్నారు. పెట్టుబడి పెట్టి పంటలు పండించిన రైతులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. కేంద్ర సహాయ నిరాకరణతో రాష్ట్ర రైతుల కోసం నాడు కేసీఆర్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. కేంద్రం కొనుగోలు చేయని పంటలను రాష్ట్ర ప్రభుత్వం తన సొంత నిధులతో మొత్తం కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చినా, ఇవ్వకపోయినా, కొనుగోలు చేసినా, చేయకపోయినా రైతులు పండించిన మక్కలు, జొన్నలు, కందులు, పెసర్లు, సోయాబీన్, శనగలు, సన్‌ఫ్లవర్ పంటలను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేసింది. ఇందుకోసం ఏకంగా రూ.12వేల కోట్లను ఖర్చు చేసింది. ముఖ్యంగా కరోనా మహమ్మారి విజృంభించిన సమయంలో బహిరంగ మార్కెట్లో పంటలు కొనుగోలు చేసే దిక్కులేక రైతులు విలవిల్లాడిపోతే రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా అన్ని పంటలను మొత్తం కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచిందని గుర్తు చేశారు. ప్రతిపక్షంలో ఉండగా పంటల

# బడిబాటతో విద్యా విప్లవం..!!





## సూరారం గ్రామంలో బడిబాట అవగాహన ర్యాలీ

### ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడిన ఉపాధ్యాయులు

### ప్రభుత్వ పాఠశాలల సౌకర్యాలపై అవగాహన

### డ్రాప్అవుట్ విద్యార్థుల గుర్తింపు

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "బడిబాట--2026" కార్యక్రమంలో భాగంగా మహాదేవపూర్ మండలం సూరారం గ్రామంలో శుక్రవారం విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయులు మేకల ఎర్రయ్య మరియు జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) పురుషోత్తం రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ప్రధాన వీధుల గుండా విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యా కమిటీ సభ్యులతో కలిసి భారీ అవగాహన ర్యాలీ చేపట్టారు. "ప్రతి చిన్నారి బడిలోకి -- ప్రతి ఇంటిలో విద్య వెలుగు", "చదువే భవిష్యత్తుకు బంగారు బాట" వంటి నినాదాలతో గ్రామ ప్రజల్లో విద్య ప్రాముఖ్యతపై చైతన్యం కల్పించారు. గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించిన ఉపాధ్యాయ బృందం పాఠశాల వయస్సు గల పిల్లల వివరాలను సేకరించింది. ఇంకా పాఠశాలలో చేరని చిన్నారులను గుర్తించి వారి తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న సౌకర్యాల గురించి వివరించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు.

**ప్రధానోపాధ్యాయులు మేకల ఎర్రయ్య మాట్లాడుతూ..**

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజన పథకం, డిజిటల్ తరగతులు, క్రీడా సదుపాయాలు, పరిశుభ్రమైన వాతావరణం వంటి అనేక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

**ఎంఈఓ పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ..**

విద్య ప్రతి బాలబాలిక హక్కు అని, ఏ చిన్నారి కూడా చదువుకు దూరం కాకుండా చూడటం సమాజం మొత్తం బాధ్యత అని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా పాఠశాలల్లో చేర్పించి క్రమం తప్పకుండా హాజరయ్యేలా ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు విద్యా ప్రమాణాల్లో గణనీయమైన పురోగతి సాధిస్తున్నాయని, ప్రజలు వాటిపై పూర్తి విశ్వాసం ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో విద్యా ప్రాధాన్యతపై ప్రతిజ్ఞ చేయించారు. అలాగే డ్రాప్ అవుట్ విద్యార్థులను తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల నుంచి పాఠశాలల్లో చేరాల్సిన పిల్లల వివరాలను కూడా సేకరించారు. ఈ కార్యక్రమంలో శ్రీమతి కంతి పద్మ , నూనేటి కవిత, జరుపుల రవీందర్ సర్, పల్నాటి సతీష్ సర్, గంగిశెట్టి వెంకటేశ్వర్లు సర్, సీహెచ్. కవితా మేడమ్, పి. కార్తీక్ సర్, డి. మనోహర దేవి మేడమ్, వి. మేరీ భాయి మేడమ్, వి. సునీల్ సర్, కె. మధుకర్ రెడ్డి, కె. అనిత లతా, ఎం. చంద్రమౌళి సర్, జి. నగేష్ సర్, టి. గోపికృష్ణ సర్, ఎల్లయ్య, నదీమ్ గారితో పాటు ఇతర ఉపాధ్యాయులు, విద్యా సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. బడి బాట కార్యక్రమం విజయవంతం కావడానికి ఉపాధ్యాయ బృందం సమిష్టిగా కృషి చేస్తూ, ప్రతి విద్యార్థి పాఠశాలలో చేరి నాణ్యమైన విద్యను పొందేలా గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు.



## తిమ్మాపురం గ్రామంలో బడిబాట కార్యక్రమం

**ఆత్మకూరు(ఎం),జూన్19/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం తిమ్మాపురం గ్రామంలో ఎంఈవో కె మహాదేవరెడ్డి ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొసనలక్ష్మమ్మ,ఉపసర్పంచ్ బట్టు మహేష్ మరియు మాజీ సర్పంచ్ కోసన కిష్టయ్య, ప్రధానోపాధ్యాయులు సంతోష, గ్రామ యువత శ్యామల నరేష్, కొసన మల్లేష్, కొసన నరేష్, బొంత దయాకర్,బట్టు నరేశ్ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రతి చిన్నారిని పాఠశాలలో చేర్పించి నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న సౌకర్యాలు మరియు సంక్షేమ పథకాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



**చౌటుప్పల్,జూన్ 19, క్రైమ్ మిర్రర్:** కాంగ్రెస్ అగ్రనేత, లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదినాన్ని మున్సిపాలిటీ అధ్యక్షులు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షులు బోయ దేవేందర్, ఆధ్వర్యంలో చౌటుప్పల్ లోని లక్కారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ... ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడుతున్న నాయకుడు రాహుల్ గాంధీ అని కొనియాడారు. దేశ ప్రజల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తూ యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. దేశ భవిష్యత్తు మరింత బలంగా, అభివృద్ధి దిశగా సాగాలంటే రాహుల్ గాంధీ వంటి నాయకత్వం అవసరమని అన్నారు.దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించే దూరదృష్టి, ప్రజల పట్ల అంకిత భావం కలిగిన నాయకుడు రాహుల్ గాంధీ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య , మునుగోడు ఎన్నికల ఇంచార్జ్ పబ్బు రాజు గౌడ్ ,వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, మున్సిపాలిటీ మాజీ అధ్యక్షులు సుర్వి నరసింహ గౌడ్, సర్పంచులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్స్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


## చౌటుప్పల్ ఎలక్ట్రిసిటీ డివిజన్ సర్వసభ్య సమావేశం



### నూతన డివిజన్ కార్యవర్గ ఎన్నిక

**చౌటుప్పల్,జూన్ 19,క్రైమ్ మిర్రర్:** తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ చౌటుప్పల్ డివిజన్ సర్వసభ్య సమావేశంను శుక్రవారం డివిజన్ అధ్యక్షులు అల్లే రమేష్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షులు పడిగం యాదగిరి, జిల్లా కార్యదర్శి అమర్నాథ్, డివిజనల్ డివిజనల్ ఇంజనీర్ డిఎస్ మల్లికార్జున లు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. విద్యుత్ ఉద్యోగులు 24 గంటలు ప్రజలకు నిరంతరాయంగా సేవలందిస్తూ సంస్థ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. విద్యుత్ ఉద్యోగులు విధి నిర్వహణలో భద్రత నియమాలను తప్పనిసరి పాటించాలని సూచించారు. విద్యుత్ ఉద్యోగులు తీవ్ర పని ఒత్తిడిలో విధులు నిర్వహిస్తున్నారని, ఉద్యోగుల హక్కులు, సంక్షేమం, సేవా సమస్యల పరిష్కారం కోసం 1104 యూనియన్ ఎల్లప్పుడు ముందుండి పోరాడుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ డివిజనల్ ఇంజనీర్ డి.ఎస్. మల్లికార్జున, ఏఓ మాదా జానయ్య, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ జి. వెంకటేష్, అదనపు కార్యదర్శులు పి. తిరుమలయ్య, కోశాధికారి శ్రీనివాసరెడ్డి, డివిజన్ కార్యదర్శి గంగుల సోమేశ్వర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సురేందర్ రెడ్డి, ట్రెజరర్ సురేష్, ఆదనపు కార్యదర్శి నోముల యాదయ్య చౌటుప్పల్ మరియు భువనగిరి డివిజన్ కార్యవర్గ సభ్యులు, డివిజన్ సభ్యులు, లీడర్లు, సెక్షన్ లీడర్లు పాల్గొన్నారు.


క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595




## మునుగోడు ప్రాథమిక పాఠశాలలో ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం



**మునుగోడు, జూన్ 19 క్రైమ్ మిర్రర్ :** మునుగోడు మండల కేంద్రంలోని స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం వైభవంగా జరిగింది.నూతన విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకుని పాఠశాలలో చేరిన చిన్నారులకు అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి అక్షరాభ్యాసం చేయించారు.ముఖ్య అతిథిగా నల్లగొండ జిల్లా విద్యాశాఖాధికారి సుశీందర్ రావు హాజరై, చిన్నారులతో మొదటి అక్షరాలు దిద్దించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.స్థానిక సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహ గౌడ్, మండల విద్యాశాఖాధికారి మల్లేశం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుంకరి బిక్షం గౌడ్, మరియు పాఠశాల ఉపాధ్యాయ బృందం చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు.ఈ సందర్భంగా డీఈఓ మరియు సర్పంచ్ మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, తల్లిదండ్రులందరూ తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని కోరారు. చిన్నారులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రులు, విద్యా కమిటీ సభ్యులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


## ఇక్కుర్తి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అక్షరాభ్యాసం



**ఆత్మకూరు(ఎం),జూన్19/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా మొటకొండూర్ మండలం ఇక్కుర్తి గ్రామంలో శుక్రవారం రోజు ప్రాథమిక పాఠశాలలో ఒకటవ తరగతి విద్యార్థులకు అక్షరాభ్యాసం చేపించడం జరిగింది.అనంతరం ఒకటవ తరగతి మరియు ఐదవ తరగతి వరకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కందుల స్వామి(చిరంజీవి),గ్రామ కార్యదర్శి రామకృష్ణారెడ్డి,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసాచార్యులు,ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు మరియు బోడ అబ్బ సాయిలు, గోధుమ కుంట శ్రీకాంత్ పాల్గొనడం జరిగింది.

## ఉద్యమ కారులతో పాటు ఉద్యమ జర్నలిస్టులను కూడా గుర్తించాలి

### తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ మండల అధ్యక్షులు గడ్డం నాగరాజు



**ఆత్మకూరు(ఎం),జూన్19/క్రైమ్ మిర్రర్:** తెలంగాణ ఉద్యమ కారులతో పాటు ఉద్యమ జర్నలిస్టులను కూడా గుర్తించాలని ప్రభుత్వాన్ని గడ్డం నాగరాజు ఒక ప్రకటనలో కోరారు . యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల తుక్కాపురం గ్రామంలో తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ మండల అధ్యక్షులు గడ్డం నాగరాజు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారిని గుర్తించేందుకు ప్రభుత్వం ఉద్యమ కారుల గుర్తింపు కమిటీ సభ్యులను నియమించిన సందర్భంగా వారికి తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ తరుపున విన్నపం తెలంగాణ ఉద్యమ కారులను గుర్తించి వారికి ప్రభుత్వం ఏమి అందిస్తుందో వాటినే ఉద్యమ జర్నలిస్టులకు కూడా అందజేయాలని కోరారు . తెలంగాణ రాష్ట్ర సాధనలో జర్నలిస్టుల పాత్ర ఎనలేనిదని అన్నారు . ఉద్యమ సమయంలో కడుపు నిండా తినక , కంటి నిండా నిద్ర పోక , వార్త సేకరణలో భాగంగా నిరంతరం ఉద్యమ కారులతోనే ప్రయాణం చేసిన జర్నలిస్టులను ఆదుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని , ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యని , తెలంగాణ ఉద్యమ కారుల గుర్తింపు కమిటీ చైర్మన్ కేశవ రావుని , కమిటీ సభ్యులు మంత్రి పొన్నం ప్రభాకర్ ని , ప్రభుత్వ విప్ శాసన మండలి సభ్యులు అద్దంకి దయాకర్ ని , శాసన మండలి సభ్యులు కోదండరాంని ,మాజీ శాసన మండలి సభ్యులు రాములు నాయక్ ని , మోతె శోభన్ రెడ్డి లను కోరారు .

# విద్యార్థుల భవిష్యత్తు కోసం పోలీసుల ప్రత్యేక భద్రత

## ప్రజలు, తల్లిదండ్రులు సహకరించాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ విజ్ఞప్తి

## అవాంఛనీయ ఘటనలు నివారించేందుకు ప్రత్యేక పెట్రోలింగ్, నిఘా బృందాలు

## నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిక

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** భూపాలపల్లి జిల్లాలో జూన్ 21న నిర్వహించనున్న నీట్ -2026 ప్రవేశ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వహించేందుకు జిల్లా పోలీసులు విస్తృత భద్రతా చర్యలు చేపట్టారు. ఈ మేరకు భారతీయ నాగరిక సురక్షా సంహిత -2023లోని సెక్షన్ 163ను అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షల రోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక నిబంధనలు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద శాంతి భద్రతలకు భంగం కలిగించే చర్యలను కట్టడి చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.



**200 మీటర్ల పరిధిలో ఆంక్షలు..!!**

పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో ఐదుగురికి మించి గుంపులుగా నిలబడటాన్ని నిషేధించారు. అలాగే సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. మైకులు, డీజేలు వంటి శబ్ద కాలుష్యానికి కారణమయ్యే పరికరాల వినియోగాన్ని పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు. పరీక్షలు సజావుగా సాగేందుకు పరీక్ష కేంద్రాల సమీపంలోని ఇంటర్నెట్ సెంటర్లు, జిరాక్స్ సెంటర్లు, స్టేషనరీ దుకాణాలు పరీక్ష సమయం వరకు మూసివేయాలని ఆదేశించారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వాచీలు తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకురావద్దని సూచించారు.

**రెండు పరీక్ష కేంద్రాల్లో ప్రత్యేక బందోబస్తు**

భూపాలపల్లి జిల్లా కేంద్రంలో గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ మరియు గవర్నమెంట్ జూనియర్ కాలేజ్లో మొత్తం రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక పెట్రోలింగ్ బృందాలను నియమించినట్లు చెప్పారు. అదే విధంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిఘా బృందాలను కూడా మోహరించినట్లు పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అంతరాయం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ప్రజల సహకారం అవసరం నీట్ పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రజలు, వివిధ సంఘాల నాయకులు, తల్లిదండ్రులు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ విజ్ఞప్తి చేశారు. విధించిన నిబంధనలను ఎవరైనా ఉల్లంఘిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరీక్షార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎస్పీ పిలుపునిచ్చారు.



## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**ఆత్మకూరు(ఎం),జూన్19/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రియతమ నేత భావి భారత ప్రధాని రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కందటి అనంతరెడ్డి మాట్లాడుతూ భారతదేశ అభివృద్ధి కోసం రాహుల్ గాంధీ దేశం మొత్తం తిరిగి భారత్ జోడోయాత్ర పేరిట అన్ని వర్గాల ప్రజలను ఏకం చేసి ప్రజాస్వామ్య పరిరక్షణకు రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు ,ప్రజా ప్రతినిధులు, మండల కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెళ్లికి ముందే పరీక్ష.. సికిల్ సెల్‌కు చెక్!

### జిల్లా ఆసుపత్రిలో ప్రపంచ సికిల్ సెల్ దినోత్సవం నిర్వహణ

### అవగాహన ర్యాలీ, స్క్రీనింగ్ పరీక్షలపై వైద్యుల సూచనలు



**మంచిర్యాల, జూన్ 19 (క్రైమ్ మిర్రర్):** ప్రపంచ సికిల్ సెల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో అవగాహన ర్యాలీని ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సుధాకర్ నాయక్, ఆర్ఎంఓ డాక్టర్ శ్రీధర్ తదితరులు జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సికిల్ సెల్ అనీమియా వంశపారంపర్యంగా సంక్రమించే రక్త సంబంధిత వ్యాధి అని తెలిపారు. వివాహానికి ముందు యువతీ యువకులు స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా భావితరాలను ఈ వ్యాధి బారిన పడకుండా కాపాడవచ్చని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ముందస్తు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో సికిల్ సెల్-థలసేమియా జిల్లా కమిటీ సభ్యులు కాసర్ల శ్రీనివాస్, చుంచు శంకర వర్మ, అవినాష్, కంకణాల భాస్కర్‌రెడ్డి, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, అల్లాడి శ్రీనివాస్, నామదేవ్, కాకినాడ వెంకటేశ్వర్లు, పుట్ట సత్తయ్య తదితరులు పాల్గొన్నారు. వైద్య సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై ర్యాలీలో పాల్గొన్నారు.

## మనసురాబాద్ వృద్ధాశ్రమంలో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుక

### వృద్ధులచే కేక్ కట్ చేయించి, మధ్యాహ్న భోజన వితరణ చేసిన కృష్ణ గోపాల్ సేవాసమితి





**ఎల్బీనగర్ జూన్ 19 క్రైమ్ మిర్రర్ ప్రతినిధి:** కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకను మనుసురాబాదులోనీ వృద్ధాశ్రమంలో కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వృద్ధులచే కేక్ కట్ చేయించి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వృద్ధాశ్రమంలో వృద్ధులకు మధ్యాహ్నం భోజనం అందజేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణ గోపాల్ సేవా సమితి అధ్యక్షులు కపిల్ కుమార్ అగర్వాల్ మరియు సేవా సమితికి చెందిన పదాధికారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మానవసేవే మాధవసేవ అనే స్ఫూర్తితో కృష్ణ గోపాల్ సేవా సమితి సమాజ సేవ కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తూనే ఉంటుంది అని కపిల్ కుమార్ అగర్వాల్ తెలిపారు.

# దేశ ప్రజల ప్రశ్నించే గొంతుక రాహుల్ గాంధీ

## యూత్ కాంగ్రెస్ కల్వకుర్తి నియోజకవర్గ ఉపాధ్యక్షులు షాబుద్దీన్

**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి:** భారతదేశ ప్రజలు ప్రశ్నించే గొంతుక రాహుల్ గాంధీ అని నియోజకవర్గ ఉపాధ్యక్షుడు శాబుద్దీన్ అన్నారు. భావి భారత ప్రధానమంత్రి, లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు, ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల కేంద్రంలోని యూత్ కాంగ్రెస్ కల్వకుర్తి నియోజకవర్గ ఉపాధ్యక్షులు షాబుద్దీన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు స్లేట్లు, పలకలు ఇతర విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కల్వకుర్తి నియోజకవర్గ ఉపాధ్యక్షులు షాబుద్దీన్ ముఖ్య అతిథులు రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి క్యామ రాజేష్ మరియు నాయకులు మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ దేశంలోని యువత, విద్యార్థులు, రైతులు, మహిళలు బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం పోరాటం చేస్తున్న ప్రజానాయకుడని కొనియాడారు. సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం ఆయన చేస్తున్న కృషి దేశ ప్రజలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని అంగన్వాడి కేంద్ర చిన్నారులకు విద్యా సామాగ్రిని పంపిణీ చేయడం ఎంతో ఆనందం కలిగించిందన్నారు. చిన్నారుల భవిష్యత్తు విద్యపై ఆధారపడి ఉంటుందని, విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందించడం ద్వారా వారి చదువులకు ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న చిన్నారులు మంచి విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య అందించడం ప్రభుత్వాలు సమాజం యొక్క బాధ్యత అని అన్నారు. చిన్నారులతో కలిసి జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని, వారి చిరునవ్వులు తమకు మరింత సేవా స్ఫూర్తిని కలిగిస్తున్నాయని తెలిపారు. సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు పవన్ కల్యాణ్, ప్రవీణ్ గౌడ్, లడ్డు మహేష్, గంజి చంద్రశేఖర్, మణికంఠ అంగన్‌వాడీ సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.






## పెద్దవూర మండలం రోడ్డు ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ పవార్




**నల్లగొండ నిఘా ప్రతినిధి(క్రైమ్ మిర్రర్):** జిల్లాలోని పెద్దవూర మండలం రామన్నగూడెం స్టేజ్ సమీపంలో, గురువారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాద ఘటన స్థలాన్ని, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ పరిశీలించారు. ఈ ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే, ఎస్పీ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద పరిస్థితులను పరిశీలించారు. ప్రమాదానికి దారితీసిన కారణాలు, ప్రమాదంలో చిక్కుకున్న వాహనాల స్థితిగతులు, రహదారి పరిస్థితులు తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఘటనకు సంబంధించిన అన్ని వివరాలను సేకరించి, ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ ప్రమాదంలో పల్నాడు జిల్లా ముప్పాల మండలం, కాకర్లపాలెం గ్రామానికి చెందిన కాకర్ల థామస్య (51), ప్రకాష్ రావు (35), వరంగల్ ప్రాంతానికి చెందిన ఎస్ఎల్‌బీసీ సైట్ ఇంజినీర్ సాయికుమార్ (20) మృతి చెందినట్లు తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారిని వెంటనే నాగార్జునసాగర్ ఏరియా ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్న విషయాన్ని ఎస్పీ తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ.. వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అతివేగం, సీట్ బెల్ట్ లేకుండా ప్రయాణం, మద్యం సేవించడం వంటి నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణంగా, ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా జాతీయ, రాష్ట్ర రహదారులపై ప్రయాణించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, వేగ పరిమితులను పాటించడంతో పాటు ఓవర్‌టేకింగ్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు దర్యాప్తులో వెల్లడయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.

## దండు మల్కాపురంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



**చౌటుప్పల్,జూన్ 19,క్రైమ్ మిర్రర్ :** యువనేత రాహుల్ గాంధీ యువతరానికి ఆదర్శమని దేప శ్యాంసుందర్ ముదిరాజ్ అన్నారు. శుక్రవారంరాహుల్ గాంధీ జన్మదినము సందర్భంగా దండు మల్కాపుర్ కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు వార్డు మెంబర్ సుక్క రవీందర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు.కాంగ్రెస్ పార్టీకి ఆయన చేసిన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ మీసాల నర్సింహ్మా, శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ చైర్మన్ దేప శ్యాంసుందర్ ముదిరాజ్,ఏఎంసి డైరెక్టర్ మహ్మద్ గౌస్ ఖాన్, వార్డు మెంబర్లు ఈడ్దుల ఇంద్రసేన యాదవ్,షేక్ అంజుం అంజద్,పక్కిర్ వంశీధర్ రెడ్డి,ఉప్పరి అనిల్,అత్తపురం సంతోష అంజిరెడ్డి,యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బుర్ర శివ కుమార్ గౌడ్,యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పక్కిర్ వంశీధర్ రెడ్డి,దేవస్థానం ధర్మకర్తలు ఈడ్దుల బాబు యాదవ్ దౌడి లింగస్వామి,సిలువేరు శంకర్,జెరిపోతుల అఖిల మహేందర్,వెంకిరాల శివచారి మాజీ అధ్యక్షులు మునుకుంట్ల రాజు గౌడ్, ఉపాధ్యక్షులు గుండ్ల చంద్రశేఖర్ మైనారిటీ అధ్యక్షులు మహ్మద్ షిరాజ్దిన్ ఈడ్దుల కేశవ్ యాదవ్,చేపురి మహేష్,మహ్మద్ గౌరె,గుండ్ల అశోక్,సుంకరి రమేష్ ముదిగొండ రమేష్,బుర్ర శ్రీకాంత్ గౌడ్,ఈడ్దుల రాజేష్,సిల్వేరు సాయి,మహంకాళి పృథ్వీ, సందగళ్ళ నవీన్ గౌడ్,కంచర్ల నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఆసుపత్రిలో..'ఎంఆర్ఐ సేవలకు రంగం సిద్ధం'

**జిల్లాలోనే అధునాతన వైద్య పరీక్షలు అందుబాటులోకి**

**ఎంఆర్ఐ పరీక్షల వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశం**

**రోగులకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం**

**సిబ్బంది, సాంకేతిక సదుపాయాలు సమృద్ధిగా ఉండేలా చర్యలు**





**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** జిల్లాలో వైద్య రంగానికి మరొక కీలక మైలురాయిగా నిలిచే ఎంఆర్ఐ (మాగ్నెటిక్ రెసోనెన్స్ ఇమేజింగ్) యంత్రం ప్రారంభానికి సిద్ధమవుతోంది. జిల్లా కేంద్రంలోని ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేస్తున్న ఎంఆర్ఐ యంత్రాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ శుక్రవారం పరిశీలించి, పనుల పురోగతిని సమీక్షించారు. యంత్రం ఏర్పాటు పనులు తుదిదశకు చేరుకున్నాయని, ప్రారంభోత్సవానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. యంత్రం నిర్వహణ, రోగుల సౌకర్యాలు, సాంకేతిక సిబ్బంది అందుబాటులో ఉండే అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎంఆర్ఐ యంత్రం అందుబాటులోకి రావడం వల్ల జిల్లాలోనే అత్యాధునిక వైద్య పరీక్షలు నిర్వహించే అవకాశం కలుగుతుందని తెలిపారు. ఇప్పటివరకు ఎంఆర్ఐ పరీక్షల కోసం రోగులు ఇతర జిల్లాలు, నగరాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, ఇకపై అదే సేవలను స్థానికంగా పొందే అవకాశం లభించడం ద్వారా సమయం, వ్యయం రెండూ ఆదా అవుతాయని పేర్కొన్నారు. ఎంఆర్ఐ పరీక్షలు చేయించుకున్న ప్రతి వ్యక్తి వివరాలను ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. సేవల నిర్వహణలో పారదర్శకత, రికార్డుల నిర్వహణకు ఇది దోహదపడుతుందని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మరింత సౌకర్యవంతమైన, నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన సిబ్బంది, సాంకేతిక వనరులు, మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, వైద్యులు, సాంకేతిక సిబ్బంది మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బడే మల్లయ్య కు నివాళులర్పించిన సర్పంచ్ కాటశీ వెంకటేశం



**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మండలం పెద్ద కాపర్తి గ్రామానికి చెందిన బడే మల్లయ్య అనారోగ్యంతో మరణించింది పార్థివ దేహానికి పూలమాలు వేసి నివాళులర్పించిన సర్పంచ్ కాటశీ వెంకటేశం కుటుంబాన్ని పరామర్శించి వారికి 5000 రూపాయల ఆర్థిక సాయం అందజేసినారు ఉప సర్పంచ్ ఓర్సు సైదులు ,వార్డు సభ్యులు కురు యాదయ్య ,పొట్లపల్లి రవి, సాగర్ల నాగరాజు ,ఏర్పు నరసింహ, తెలుసూరు సైదులు, తదితరులు పాల్గొన్నారు.

## చౌటుప్పల్‌లో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు..

**స్థానికుల సమస్యలపై ట్రాఫిక్ సీఐ దృష్టి**



**చౌటుప్పల్,జూన్ 19,క్రైమ్ మిర్రర్ :** యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో జరుగుతున్న జాతీయ రహదారి విస్తరణ పనుల నేపథ్యంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ, చౌటుప్పల్ డివిజన్ ట్రాఫిక్ డీస్పీపి ఆదేశాల మేరకు ట్రాఫిక్ సీఐ నందగిరి వెంకటేష్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. హైవేపై అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులు కొనసాగుతున్న ప్రాంతాల్లో స్థానికులు, పాదచారులు, ద్విచక్ర వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా నడకదారులు ఏర్పాటు చేయడంతో పాటు టూ వీలర్ వాహనాలు సులభంగా వెళ్లేందుకు చర్యలు తీసుకున్నారు. షాపుల ముందు ఏర్పాటు చేసిన బోర్డులు, నిర్మాణాలకు అడ్డంగా ఉన్న డబ్బాలు మరియు ఇతర వస్తువులను కొద్దిగా వెనక్కి జరిపించలని షాపు యాజమాన్యాలకు సూచించారు. ఈ సందర్భంగా స్థానిక వ్యాపారులు, ప్రజలతో మాట్లాడిన సీఐ వారి సమస్యలను తెలుసుకుని, ట్రాఫిక్ అంతరాయం లేకుండా జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు సజావుగా సాగేందుకు అవసరమైన నియంత్రణ చర్యలు చేపట్టారు.

# ఖుదాబక్ష్‌పల్లిలో ఘనంగా వన మహోత్సవం

**పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా మొక్కలు నాటిన అధికారులు, ప్రజాప్రతినిధులు**



**మర్రిగూడ(క్రైమ్ మిర్రర్):** మండలంలోని కుదాభక్శల్లి గ్రామపంచాయతీ నందు, సర్పంచ్ పందుల జయలక్ష్మిపాండు అధ్యక్షతన, గ్రామసభ నిర్వహించారు. అనంతరం వన మహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, మండల ఎంపీడీవో జిని మునయ్య, మండల ఎంపీఓ బి. రవికుమార్, ఈసీ వివేక్ సాగర్ హాజరై, గ్రామంలోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మొక్కలు నాటడం, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని ఆయన అన్నారు. నేడు నాటిన ప్రతి మొక్క రేపటి తరాలకు ప్రాణవాయువును అందించే అమూల్యమైన సంపధని పేర్కొన్నారు. హరితహారమే లక్ష్యంగా మొక్కల పెంపకం, సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఒక్క మొక్క నేటి అవసరం కాదని, రేపటి తరాల భవిష్యత్తుకు మనం ఇచ్చే అమూల్యమైన కానుకని, పచ్చని ఖుదాబక్ష్‌పల్లి నిర్మాణానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రామాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ షేక్ షబ్బీర్, పంచాయతీ కార్యదర్శి ప్రసన్న బాబు, పాలకవర్గ సభ్యులు, జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ శాఖ అధ్యక్షులు, గ్రామాధికారులు, హౌసింగ్ ఏఈతో పాటు, గ్రామ ప్రజలు పెద్దఎత్తున పాల్గొని మొక్కలు నాటారు.

## హకీంపేట్ భూ పార్సెల్ ఈ-వేలానికి విశేష స్పందన

**హెచ్ఎండీఏ ప్రీ-బిడ్ సమావేశం**






**హైదరాబాద్ : ( క్రైమ్ మిర్రర్ ):** హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) ఆధ్వర్యంలో హకీంపేట్‌లోని విలువైన భూ పార్సెల్ ఈ-వేలం ప్రతిపాదనకు సంబంధించి శుక్రవారం బంజారాహిల్స్‌లోని హయత్ ప్లేస్ హోటల్‌లో ప్రీ-బిడ్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి 50 మందికి పైగా భావి బిడ్డర్లు హాజరై విశేష ఆసక్తి కనబరిచారు..సమావేశంలో జేఎల్ఎల్ సంస్థ ప్రతినిధి సందీప్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ దూరదృష్టి, హైదరాబాద్ నగర వేగవంతమైన అభివృద్ధి, హకీంపేట్ భూ పార్సెల్ వ్యూహాత్మక ప్రాధాన్యత, పెట్టుబడిదారులకు లభించే అవకాశాలు మరియు భవిష్యత్ అభివృద్ధి అవకాశాలపై సమగ్ర వివరణ ఇచ్చారు. అలాగే ఎంఎస్‌టీసీ సంస్థ మేనేజర్ జమీల్ అక్తర్ ఈ-వేలం ప్రక్రియపై సవివర ప్రజెంటేషన్ నిర్వహించి, బిడ్డర్ల సందేహాలను నివృత్తి చేశారు. పారదర్శకమైన వేలం విధానం, పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పించడంపై పాల్గొన్న వారు హెచ్ఎండీఏ చర్యలను అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండీఏ ప్రధాన ఇంజనీర్ బి. రవీందర్, సూపరింటెండింగ్ ఇంజనీర్ రజిత, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్లు ఎ. రవీందర్ రెడ్డి, బి. ప్రసాద్ రావు, సికింద్రాబాద్ డివిజన్ ఆర్డీవో సాయిరామ్, డిప్యూటీ కలెక్టర్ వై. సుదర్శన్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామారావుతో పాటు హెచ్ఎండీఏ ఎస్టేట్స్, ప్రజాసంబంధాలు, ఇంజనీరింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల అధికారులు పాల్గొన్నారు. పెట్టుబడిదారుల నుంచి సానుకూల స్పందన లభించిన ఈ ప్రీ-బిడ్ సమావేశం విజయవంతంగా ముగిసినట్లు హెచ్ఎండీఏ అధికారులు తెలిపారు

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. మృతుడు చెరబహదూర్, తండ్రి పేరు లైన్ బహదూర్, వయస్సు 47 సంవత్సరాలు, కులం ఓబీసీ, వృత్తి కూలీ(శ్రీ పైప్స్ అండ్ ఇన్ఫ్రా ర్ కంపెనీ పిట్టంపల్లి), ప్రస్తుతం పిట్టంపల్లి గ్రామం, చిట్యాల మండలంలో నివాసం ఉంటున్నాడు. స్వస్థలం బలిజారి జపనాల్ పోస్టు, నాగోల్, అస్సాం రాష్ట్రం. చరబహదూర్ తేది 14.06.2026 న సాయంత్రం కూరగాయల కోసం వెలిమినేడు కి వెళ్లి, వెలిమినేడు నుండి పిట్టంపల్లికి తన ద్విచక్ర వాహనం నెం. టి ఎస్ 05 సి జి 7026 పై వెళ్తుండగా రాత్రి 10.30 గంటలకు సెవెంటీ కంపెనీ వద్దకు చేరుకోగానే తను నడుపుతున్న బైక్ అదుపు తప్పి స్వయంగా జారి పడటంతో తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం కామినేని హాస్పిటల్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ నిన్న అనగా తేదీ 18.06.2026 న సాయంత్రం 5.07 కి మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తమ్ముడు అంబహదూర్ తండ్రి పేరు లైన్ బహదూర్, వయస్సు 45 సంవత్సరాలు, కులం ఓబీసీ, వృత్తి సెక్యూరిటీ గార్డ్, ప్రస్తుతం పిట్టంపల్లి గ్రామం, చిట్యాల మండలంలో నివాసం ఉంటున్నాడు. స్వస్థలం బలిజారి జపనాల్ పోస్టు, నాగోల్, అస్సాం రాష్ట్రం. ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిట్యాల ఎస్సై రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

# అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం

**దర్గా అక్రమాలు, దౌర్జన్యాలపై ప్రశ్నిస్తే అరెస్టులా...?**

**అక్రమ అరెస్టుతో నా పోరాటాన్ని ఆపలేరు**

**జాన్ పహాడ్ దర్గా ఉప సర్పంచ్ నాగరాజు**




**క్రైమ్ మిర్రర్, హుజూర్ నగర్ (పాలకీడు) :** ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే అక్రమంగా అరెస్టు చేయడం అప్రజాస్వామికం అని జాన్ పహాడ్ దర్గా ఉప సర్పంచ్ నాగరాజు అన్నారు. పాలకీడు మండలం జాన్ పహాడ్ దర్గా వద్ద జరుగుతున్న అక్రమ వసూలు దౌర్జన్యాలు అన్యాయంగా భక్తుల మీద దాడి చేయడం అధికారికంగా కాంట్రాక్టు లేని పక్షంలో భక్తుల వద్ద నుండి అధిక మొత్తంలో వసూలు చేస్తున్న దళారుల గుత్తేదారుల ప్రమేయం లేకుండా చెయ్యాలనే ఉద్దేశంతో చేపడుతున్న ధర్మ పోరాటంలో అక్రమ అరెస్టులు , ప్రివెంటివ్ అరెస్టు లతో పోరాటాన్ని ఆపలేరు అన్నారు . చట్టం ప్రకారమే దర్గా ఇన్స్పెక్టర్ కి ,సూర్యాపేట జిల్లా కలెక్టర్ కి, వక్ఫ్ బోర్డు చైర్మన్ కి , సీఈవో కి రాతపూర్వకంగా దరఖాస్తు చేయడం జరిగిందన్నారు. అయినా వర్ఫ్ బోర్డ్ అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి అక్కడ అధికారికంగా టెండర్ ప్రక్రియ, అధికారికంగా రేట్ల పట్టికను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

## శంషాబాద్‌లో గుర్తుతెలియని వృద్ధుడు మృతి



**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** శంషాబాద్ పరిధిలోని లిమ్స్ ఆసుపత్రి ప్రాంతంలో ఫ్లైఓవర్ కింద సుమారు 60 నుంచి 65 సంవత్సరాల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి మృతదేహంగా కనిపించిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. స్థానికుల సమాచారం మేరకు మృతుడు కొంతకాలంగా శంషాబాద్ ప్రాంతంలో భిక్షాటన చేస్తూ జీవనం సాగించేవాడు. అతని కుడికాలు విరిగి ఉండగా, దానికి కట్లు కట్టబడి ఉన్నట్లు గుర్తించారు. అనారోగ్య సమస్యల కారణంగా మృతి చెందిన ఉండవచ్చని స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడి గుర్తింపు కోసం ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. మృతుడిని ఎవరైనా గుర్తించినట్లయితే వెంటనే క్రింది నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని పోలీసులు కోరారు. సంప్రదింపు వివరాలు స్టేషన్ హౌస్ అధికారి (ఎస్‌హెచ్‌వో): 8712663310 సహాయ ఉప నిరీక్షకుడు (ఏఎస్ఐ): 8712567977 పోలీసు స్టేషన్ 8712663319 మృతుడి కుటుంబ సభ్యులు లేదా వివరాలు తెలిసిన వారు వెంటనే పోలీసులను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

## గండిపేట ఎంజీఐటీలో ఐదు రోజుల అధ్యాపకుల నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం



**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** గండిపేటలోని మహాత్మా గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ)లో ఎం అండ్ హెచ్ మరియు కంప్యూటర్ సైన్స్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో "పైథాన్ ఉపయోగించి కంప్యూటేషనల్ మ్యాథమెటిక్స్" అంశంపై ఐదు రోజుల అధ్యాపకుల నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం (ఎఫ్‌డీపీ) విజయవంతంగా నిర్వహించారు. అధ్యాపకులు, పరిశోధకులకు పైథాన్ ప్రోగ్రామింగ్ ద్వారా గణిత సమస్యల పరిష్కారం, డేటా విశ్లేషణ, సంఖ్యా పద్ధతులు, శాస్త్రీయ గణనలు వంటి అంశాలపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు.

కార్యక్రమంలో నిపుణులు నార్ల రామకృష్ణ, బి. ప్రవల్లిక, వి. భార్గవి, జి. భవాని, బి. చంద్రశేఖర్‌లు నమ్‌పై, సైపై, మ్యాట్‌ప్లాట్‌లిబ్ వంటి పైథాన్ గ్రంథాలయాల వినియోగం, గణిత నమూనాల రూపకల్పన, డేటా దృశ్యీకరణ, పరిశోధనలో వాటి ప్రాముఖ్యతపై సవివరంగా వివరించారు. ప్రాయోగిక సమావేశాల ద్వారా అధ్యాపకులు వివిధ గణిత, ఇంజినీరింగ్ సమస్యలకు కంప్యూటర్ ఆధారిత పరిష్కారాలను అభ్యసించారు. ఈ కార్యక్రమం అధ్యాపకుల బోధన, పరిశోధన సామర్థ్యాలను మరింత మెరుగుపరుస్తుందని కళాశాల యాజమాన్యం పేర్కొంది. ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. చంద్రమోహన్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. సుధాకర్ రెడ్డి, కన్వీనర్లు ప్రొఫెసర్ టి. రజనీకాంత్, ప్రొఫెసర్ సి. రమేశ్ కుమార్ రెడ్డి, డాక్టర్ వి. హరిలీల, డాక్టర్ ఎస్. రాజిరెడ్డి, డాక్టర్ కె. శ్రీహరి పాల్గొని ఎఫ్‌డీపీ ప్రాధాన్యంపై విలువైన సూచనలు చేశారు. ప్రస్తుత మార్పులకు అనుగుణంగా అధ్యాపకులు కొత్త సాంకేతికతలను అందిపుచ్చు కోవాలని వారు సూచించారు..ఈ ఎఫ్‌డీపీ విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన నిపుణులు, సమన్వయకర్తలు, పాల్గొన్న అధ్యాపకులకు కళాశాల ప్రిన్సిపాల్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
8 శనివారం 20-6-2026

# వేములపల్లి పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీ

## పరిశీలన అనంతరం పలు సూచనలు చేసిన ఎస్పీ పవార్





**నల్లగొండ నిఘా ప్రతినిధి(క్రైమ్ మిర్రర్):** నల్గొండ జిల్లా వేములపల్లి పోలీస్ స్టేషన్‌ను, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ వార్షిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాలను పరిశీలించి, రికార్డుల నిర్వహణ, కేసుల దర్యాప్తు పురోగతి, సిబ్బంది పనితీరు తదితర అంశాలను సమీక్షించారు. తనిఖీలో భాగంగా స్టేషన్‌లో నిర్వహిస్తున్న ఎఫ్ఐఆర్ రిజిస్టర్లు, కేసు డైరీలు, బీట్లు, వారెంట్లు, పెండింగ్ కేసులు, కమ్యూనిటీ పోలీసింగ్ రికార్డులు తదితర పత్రాలను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు న్యాయం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల నమోదైన రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు, ఇతర నేరాల వివరాలను సమీక్షించి, వాటి నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. జాతీయ, రాష్ట్ర రహదారులపై ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు, అవగాహన కార్యక్రమాలు, ప్రమాదకర ప్రాంతాల గుర్తింపు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. గ్రామాలు, ప్రధాన కూడళ్లు, వ్యాపార సముదాయాలు, దేవాలయాలు ప్రజా రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో, సీసీ కెమెరాల ఏర్పాటును మరింత విస్తరించాలని సూచించారు. సీసీ కెమెరాలు నేరాల నియంత్రణతో పాటు నేరస్తులను గుర్తించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. దొంగతనాల నివారణకు రాత్రి వేళల్లో నైట్ బీట్లు, వాహన తనిఖీలు, అనుమానిత వ్యక్తులపై నిఘా చర్యలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. గ్రామాల్లో బీట్ అధికారులు ప్రజలతో నిరంతరం సంబంధాలు కొనసాగిస్తూ, స్థానిక సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమ ఇసుక రవాణా, పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలు తరలింపు, పేకాట, గుట్కా, ఇతర అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. ఇటువంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై, కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, సమాచారం సేకరణ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, యువతలో అవగాహన కార్యక్రమాలు, డ్రగ్స్ నిర్మూలన చర్యలు, శాంతి భద్రతల పరిరక్షణ అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రజలకు సత్వర సేవలు అందించే విధంగా, స్టేషన్ సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ప్రతి ఫిర్యాదును బాధ్యతతో స్వీకరించి చట్టపరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, సిబ్బంది హాజరు, ఆయుధాల నిర్వహణ, కమ్యూనికేషన్ వ్యవస్థలు, అత్యవసర స్పందన విధానాలను కూడా ఎస్పీ పరిశీలించి తగిన సూచనలు చేశారు. ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ సాధ్యమవుతుందని పేర్కొంటూ, అనుమానాస్పద వ్యక్తులు ఘటనలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్బి సీఐ ఆదిరెడ్డి, మిర్యాలగూడ రూరల్ సీఐ పిఎన్డి ప్రసాద్, వేములపల్లి ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.



### నూతన తహసీల్దార్ ను కలిసిన భాజపా నాయకులు

**క్రైమ్ మిర్రర్,పాలకీడు :** పాలకీడు మండల తహశీల్దార్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన వాజిద్ అలీ ని బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు నరి నాయక్ నేతృత్వంలోని నాయకుల బృందం మర్యాదపూర్వకంగా సందర్శించింది. ఈ సందర్భంగా నూతన అధికారిని శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి కార్మిక విభాగ జిల్లా కన్వీనర్ కాటూరి శేషగిరిరావు, జిల్లా కౌన్సిల్ నెంబర్ గుండ్రెడ్డి విజయభాస్కర్ రెడ్డి ,మండల ప్రధాన కార్యదర్శి మంద చినలాజర్ ,మండల సీనియర్ నాయకులు కుందూరి మట్టారెడ్డి, పాలకవీడు బూత్ అధ్యక్షులు కొండ శ్రీను, బెజ్జం సైదులు ,రాయి గోపాల్ ,ధీరావత్ నాగేందర్ ,మేకల శ్రీనివాస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మున్సిపల్ పరిధిలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుక కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పోకల దేవదాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పందిరి గీత , కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### పేకాటరాయుళ్ల అరెస్ట్

బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) మీర్పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సాయి బాలాజీ హోమ్స్ కాలనీ పరిసర ప్రాంతంలో కొంతమంది పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి పేకాట సెట్లు 6, 7 స్మార్ట్ మొబైల్, 200 పోకర్ కాయిన్స్ స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు మీర్పేట్ పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు.

### ఖేత్ బచావో అభియాన్‌లో భాగంగా ఐఐఓఆర్‌లో అవగాహన కార్యక్రమం






**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** భారత ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమంలో భాగంగా, హైదరాబాద్‌లోని ఐసీఏఆర్--భారతీయ నూనెగింజల పరిశోధన సంస్థ (ఐఐఓఆర్) లో ఎరువుల సమతుల్య వినియోగం, పరిమిత రసాయన ఎరువుల వాడకం మరియు నేల ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ విద్యార్థులు శాస్త్రీయ పద్ధతుల్లో ఎరువులను వినియోగించడం, అవసరానికి మించి రసాయన ఎరువుల వాడకం వల్ల నేల సారవంతత తగ్గడం, భూమి ఆరోగ్యం దెబ్బతినడం వంటి అంశాలపై శాస్త్రవేత్తలు వివరించారు. అలాగే నేల పరీక్షల ఆధారంగా పోషక నిర్వహణ, సమగ్ర పోషక నిర్వహణ విధానాలు, పర్యావరణ హిత వ్యవసాయ పద్ధతుల ప్రాముఖ్యతను వివరించారు.కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం (పీజేటీఎస్ఏయూ) విద్యార్థులతో పాటు ఐఐఓఆర్ శాస్త్రవేత్తలు, టెక్నికల్ అసిస్టెంట్లు, సీనియర్ రీసెర్చ్ ఫెలోలు, టెక్నికల్ ప్రాజెక్ట్ సిబ్బంది మరియు ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.అధిక ఎరువుల వినియోగం వల్ల నేల నాణ్యత క్షీణించడం, సాగు ఖర్చులు పెరగడం, పంట దిగుబడులపై ప్రతికూల ప్రభావం పడటం, పర్యావరణ సమతుల్యత దెబ్బతినడం వంటి సమస్యలను శాస్త్రవేత్తలు వివరించి, రైతులు సమతుల్య ఎరువుల వినియోగాన్ని అలవర్చుకోవాలని సూచించారు.కార్యక్రమం ద్వారా నేల ఆరోగ్య పరిరక్షణ, సుస్థిర వ్యవసాయం, శాస్త్రీయ ఎరువుల నిర్వహణ అవసరాన్ని తెలియజేస్తూ, భవిష్యత్ తరాలకు సురక్షితమైన వ్యవసాయ భూములను అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు..చివరగా పాల్గొన్న వారందరూ భూమి ఆరోగ్య పరిరక్షణ, సుస్థిర వ్యవసాయ అభివృద్ధి కోసం శాస్త్రీయ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించాలని సంకల్పించారు.

### డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ పై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి

#### స్వేరో స్టూడెంట్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఆకులపల్లి నరేష్



**క్రైమ్ మిర్రర్, నాంపల్లి:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ని ఉద్దేశించి చేసిన వ్యక్తిగత వ్యాఖ్యలు తీవ్రంగా ఖండించదగినవని స్వేరో స్టూడెంట్స్ యూనియన్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు ఆకుల పల్లి నరేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ నాయకులు రాజకీయ అంశాలు, ప్రజా సమస్యలపై విమర్శలు చేసుకోవడం సహజమేనని, అయితే వ్యక్తుల శారీరక రూపాన్ని, వ్యక్తిగత అంశాలను ప్రస్తావిస్తూ అవమానకరంగా మాట్లాడటం సరైన పద్ధతి కాదని అన్నారు.

డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ స్వేరో నెట్‌వర్క్ ద్వారా తెలంగాణ రాష్ట్రంలో వేలాది మంది పేద, అణగారిన వర్గాల విద్యార్థులకు విద్య, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ శిక్షణ అందించి సమాజ అభివృద్ధికి విశేష సేవలు అందించారని గుర్తు చేశారు. ఆయన సేవలను గుర్తించి గౌరవించాల్సిన సమయంలో వ్యక్తిగతంగా దురుద్దేశంతో కించపరిచే వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు స్వేరో నెట్‌వర్క్‌కు చెందిన విద్యార్థులు, యువత, సామాజిక న్యాయాన్ని విశ్వసించే అనేక మంది మనోభావాలను దెబ్బతీశాయని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకొని డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ కి, స్వేరో కుటుంబానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆకుల పల్లి నరేష్ డిమాండ్ చేశారు.

### ఎన్‌పీఎస్ సంచయ్ పథకంపై... నల్గొండలో అవగాహన కార్యక్రమం



**క్రైమ్ మిర్రర్, నల్గొండ బ్యూరో :** పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ పీఎఫ్ఆర్డిఏ వ్యవసాయదారులు, వ్యవసాయ కార్మికులు, అనుబంధ రంగాల్లో పనిచేసే కార్మికులు మరియు అధికారిక పెన్షన్ సదుపాయం లేని నానో సంస్థల కోసం ప్రత్యేకంగా ఎన్‌పీఎస్ సంచయ్ అనే కొత్త పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ అవగాహన కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంస్థల (ఫ్రూ)ఎఫ్ పి వో సభ్యులు, గ్రామీణ కళాకారులు, అనుబంధ రంగ కార్మికులు మరియు చిన్న వ్యాపారవేత్తలలో పెన్షన్ చేర్పును మరింత విస్తరించడం.పీఎఫ్ఆర్డీఏ మార్గదర్శకాల మేరకు, అసంఘటిత మరియు గ్రామీణ ప్రజల్లో పెన్షన్ చేర్పు, ఆర్థిక భద్రతను ప్రోత్సహించే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ ఎల్ బి సీ )నల్గొండ లీడ్ బ్యాంక్ కార్యాలయం ఆధ్వర్యంలో 19 జూన్ 2026న నల్గొండలో ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పీఎఫ్ఆర్డీఏ అధికారులు జిల్లా పరిపాలన అధికారులు, నాబార్డ్, ఎస్ఎల్‌బీసీ అధికారులు మరియు వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం నల్గొండలోని శాలిని రెసిడెన్సీ అండ్ బ్యాంక్వెట్ హాల్, శివాజీ రోడ్‌లో నిర్వహించబడింది.కార్యక్రమంలో పీఎఫ్ఆర్డీఏ అధికారులు ఎన్‌పీఎస్ సంచయ్ పథకంపై సమగ్ర ప్రజెంటేషన్ అందించి, పాల్గొన్న వారితో పరస్పర చర్చ నిర్వహించారు. ఇందులో పథకం ప్రత్యేకతలు, అర్హత ప్రమాణాలు, చందా చెల్లింపు ఎంపికలు మరియు నమోదు ప్రక్రియ గురించి సవివరంగా అవగాహన కల్పించారు.

అదేవిధంగా, బ్యాంకు అధికారులు మరియు క్షేత్రస్థాయి సిబ్బంది సంభావ్య లబ్ధిదారులను చురుకుగా గుర్తించి, వారికి సులభమైన నమోదు ప్రక్రియను కల్పించాలని సూచించారు. గ్రామీణ స్థాయిలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందిస్తూ, ప్రభుత్వ సహకారంతో ఆర్థిక చేర్పు కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ఈ కార్యక్రమం నొక్కి చెప్పింది.

**కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు:**

శ్రీ ప్రియవ్రత మిశ్రా, డీజీఎం (బి అండ్ ఓ), స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా , నల్గొండ టి. వంశీ, అధికారి, పీఎఫ్ఆర్డీఏ, సచిన్ రాఠీ, అధికారి, పీఎఫ్ఆర్డీఏ రమేష్, జాయింట్ డైరెక్టర్, పశు సంవర్ధక శాఖ, తెలంగాణ ప్రభుత్వంనయ్, డీడీఎం, నాబార్డ్ సతీష్ కుమార్, జనరల్ మేనేజర్, జిల్లా పరిశ్రమల కేంద్రం, తెలంగాణ ప్రభుత్వం జి.ఆర్. శ్రీహరి, ఏజీఎం, ఎస్‌బీఐ, ఎస్ఎల్‌బీసీ, తెలంగాణ వి. గోపాల కృష్ణమూర్తి, ఏజీఎం, ఎస్‌బీఐ, ఎస్-ఎల్‌బీసీ, తెలంగాణశ్రీ కృష్ణ శర్మ, జనరల్ మేనేజర్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్.



### అమీన్‌పూర్‌లో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూన్ 19: భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను అమీన్‌పూర్ పట్టణ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శశిధర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడుతున్న నాయకుడు రాహుల్ గాంధీ అని పేర్కొన్నారు. యువతకు స్ఫూర్తిగా నిలుస్తూ ప్రజల సమస్యలను పార్లమెంట్‌తో పాటు ప్రజాక్షేత్రంలోనూ ధైర్యంగా ప్రస్తావిస్తున్నారని కొనియాడారు. ప్రజల సంక్షేమం, రైతులు, యువత, మహిళలు, పేదల అభ్యున్నతే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని, రాహుల్ గాంధీ నాయకత్వంలో దేశంలో ప్రజాస్వామ్య విలువలు మరింత బలోపేతం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ ఆయురారోగ్యాలతో దీర్ఘాయుష్షు పొందాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో బీరంగూడ దేవాలయ చైర్మన్ సుధాకర్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, సేవాదళ్ ప్రతినిధులు, వార్డు అధ్యక్షులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది.

### ఘనంగా భావిభారత ప్రధాని రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**సంస్థాన్ నారాయణపురం, జూన్ 19(క్రైమ్ మిర్రర్ ):**యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ మండల కార్యాలయంలో భావిభారత ప్రధాని 56వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సంస్థాన్ నారాయణపురం సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి, మాజీ ఎంపీపీ గుత్తా ఉమా ప్రేమ్చందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు మందు గుల బాలకృష్ణ, నారాయణపురం మాజీ సర్పంచ్ కొండ్రెడ్డి నరసింహ, వార్డు సభ్యులు సురపల్లి వెంకటేష్, బల్లగిరి శివ సాగర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాచకొండ రమేష్ బాబు, చిలుకూరి శ్రీనివాస్, గునిగంటి రాజు గౌడ్,రేవనపల్లి గోపాల్,బద్దుల యాదగిరి యాదవ్, మారగోని శంకర్ గౌడ్, సుర్వి శంకర్ గౌడ్, క్రైమ్ మిర్రర్ రిపోర్టర్ ఉప్పల వెంకటేష్, వలిగొండ మాధవులు, వడ్డేపల్లి శివప్రసాద్, యువజన కాంగ్రెస్ నాయకులు బానోతు కిరణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు



# ఖైతలాపూర్‌లో దుర్గామాత పుట్ట గుడి ధ్వంసం

**నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలి**

**ఘటనపై ఆందోళన వ్యక్తం చేసిన మాజీ కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్**



**కూకట్ పల్లి, జూన్ 19 (క్రైమ్ మిర్రర్) :** ఖైతలాపూర్ గ్రౌండ్స్‌లోని సర్వే నంబర్ 911లో గత నాలుగు తరాలుగా గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్న దుర్గామాత పుట్ట గుడిని గుర్తుతెలియని వ్యక్తుల చేత ధ్వంసానికి గురైనట్లు సమాచారం అందడంతో, మూసాపేట్ మాజీ కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ ఘటనాస్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఖైతలాపూర్ గ్రామ ప్రజలు ఈ దేవాలయాన్ని అత్యంత పవిత్రంగా భావిస్తూ ఎన్నో సంవత్సరాలుగా పూజలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రతి ఏడాది బోనాల పండుగను ఈ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించడంతో పాటు, ఇతర దేవాలయాల్లో జరిగే కళ్యాణోత్సవాల కోసం కూడా ఇక్కడి దుర్గామాత పుట్ట గుడి మట్టిని తీసుకెళ్లే సంప్రదాయం కొనసాగుతోందని పేర్కొన్నారు. అలాంటి ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాధాన్యత కలిగిన ఈ పుణ్యక్షేత్రాన్ని కొందరు గుర్తుతెలియని వ్యక్తులు నిన్న రాత్రి ధ్వంసం చేసినట్లు ప్రాథమిక ఆధారాలు సూచిస్తున్నాయని ఆయన అన్నారు. గుడి పరిసర ప్రాంతంలో వాహనం సంచరించిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయని, కారుతో గుడి చుట్టూ పలుమార్లు తిరుగుతూ నిర్మాణాన్ని కూల్చివేసినట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఘటనపై సంబంధిత పోలీసు అధికారులకు సమాచారం అందించగా, వారు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలనలు చేపట్టినట్లు మహేందర్ వెల్లడించారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి, బాధ్యులైన వ్యక్తులను గుర్తించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మతపరమైన భావోద్వేగాలను దెబ్బతీసే ఇటువంటి చర్యలను ప్రభుత్వం, పోలీసులు అత్యంత సీరియస్‌గా పరిగణించాలని కోరారు. ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన స్థానిక హిందూ సమాజ ప్రతినిధులు, నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠిన శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ఐలయ్య, పిల్లి మధుసూదన్, కృష్ణ యాదవ్, ధనరాజు, రాము, ప్రశాంత్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, బైండ్ల రవి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేత

**చౌటుప్పల్,జూన్ 19,క్రైమ్ మిర్రర్:** ఎల్లగిరి గ్రామానికి చెందిన మారగోని కుటుంబం సామాజిక సేవా కార్యక్రమాల కోసం "మారగోని ఫౌండేషన్"ను ప్రారంభించింది. శుక్రవారం నేథన్ మారగోని పుట్టినరోజు సందర్భంగా ఎల్లగిరి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో కలిసి పుట్టినరోజు వేడుకలు నిర్వహించి,పాఠశాలలోని 25 మంది విద్యార్థులకు పుస్తకాలు, స్టేషనరీ వస్తువులు,చాక్లెట్లు పంపిణీ చేశారు. అలాగే అంగన్వాడీ పాఠశాలలో ఉన్న 20 మంది చిన్నారులకు స్లేట్లు, స్లేట్ పెన్సిల్స్ మరియు అవసరమైన ఇతర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ డైరెక్టర్ మారగోని అశోక్ గౌడ్ మాట్లాడుతూ... మారగోని ఫౌండేషన్ ద్వారా గ్రామ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు మరియు విద్యార్థులకు అవసరమైన సహాయం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు పావని మారగొని, గ్రామ సర్పంచ్ రెక్కల మహేందర్ రెడ్డి, వార్డు సభ్యులు బాలగోని శివ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వనం విజయమ్మ, ఉపాధ్యాయులు నరేందర్ రెడ్డి, అంగన్వాడీ టీచర్స్ బాలగోని సంతోష, పల్లెర్ల నిరోజ, కుటుంబ సభ్యులు గోపి యాదాకర్ గౌడ్, అంతటి శివ గౌడ్ , పాఠశాల సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## ఆదరణ ఫౌండేషన్ లో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు







బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ 57వ జన్మదిన సందర్భంగా ఐఎన్టియుసి ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆదరణ ఫౌండేషన్ లోని చిన్నారులతో కలిసి రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బిజ్జుల రామకృష్ణారెడ్డి, సీనియర్ ప్రధాన కార్యదర్శి ఉప్పల శివకుమార్ గుప్త, వర్కింగ్ ప్రెసిడెంట్లు కృష్ణారెడ్డి, కోడుమూరు దయాకర్, ప్రధాన కార్యదర్శి ఎస్కె ప్రసన్న, ట్రెజరర్ అనిత రెడ్డి, సెక్రటరీలు జిల్లా శ్రీనివాస్, రమేష్, జాయింట్ సెక్రెటరీ అశోక్, మహిళా కార్యవర్గ సభ్యురాలు కృష్ణవేణి, తెలంగాణ స్టేట్ క్యాబ్ డ్రైవర్స్ అధ్యక్షుడు రఫీ, ఐఎన్టియుసి ఫెడరేషన్ కార్యవర్గ నాయకులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

## 7 లక్షల ఆపరేషన్... అతి తక్కువ ఖర్చుతోనే

**ఖమ్మం కూరపాటి హాస్పిటల్‌లో బాలుడికి బ్రెయిన్ ట్యూమర్ సర్జరీ సక్సెస్**

**మానవత్వం చాటుకున్న చైర్మన్ డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్**

**ఆపరేషన్ జరిగిన 72 గంటల్లోనే నడిచిన చిన్నారి ఆషీర్**





**క్రైమ్ మిర్రర్ ఖమ్మం జిల్లా :** మేమున్నామంటూ ఖమ్మంలోని ప్రముఖ కూరపాటి చిల్డ్రన్ అండ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ మరోసారి మానవత్వాన్ని చాటుకుంది. హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఏడు లక్షల రూపాయల వరకు ఖర్చయ్యే సంక్లిష్టమైన బ్రెయిన్ ట్యూమర్ శస్త్రచికిత్సను, అత్యంత తక్కువ ఖర్చుతోనే విజయవంతంగా పూర్తి చేసి ఆ చిన్నారికి పునర్జన్మ ప్రసాదించింది.

**ఫిట్స్‌తో చేరిక... పరీక్షల్లో ట్యూమర్ గుర్తింపు**

ఖమ్మం జిల్లా తల్లంపాడు గ్రామానికి చెందిన జి.ఆషీర్ అనే బాలుడు తీవ్ర అనారోగ్యంతో ఈ నెల 12వ తేదీన కూరపాటి చిల్డ్రన్ అండ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో చేరాడు. బాలుడికి వరుసగా ఫిట్స్ వస్తుండటంతో వైద్యులు వెంటనే అప్రమత్తమై సిటీ స్కాన్ నిర్వహించారు. ప్రాథమికంగా బ్రెయిన్ ట్యూమర్ ఉన్నట్లు గుర్తించిన డాక్టర్లు, మరింత లోతుగా పరిశీలించేందుకు ఎంఆర్ఐ స్కాన్ చేయించారు. ఇందులో బాలుడి మెదడు లోపలి భాగంలో ట్యూమర్ (ణచీజు) ఉన్నట్లు నిర్ధారణ అయింది.

**రూ. 7 లక్షలు అవుతుందనడంతో దిక్కుతోచని స్థితిలో...**

ఈ ఆపరేషన్ చేయడానికి హైదరాబాద్‌లో రూ. 7 లక్షల వరకు ఖర్చవుతుందని తెలియడంతో, అంత స్తోమత లేని బాలుడి తల్లిదండ్రులు చేతులెత్తేశారు. చివరకు దిక్కుతోచని స్థితిలో కూరపాటి చిల్డ్రన్ అండ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్‌ను ఆశ్రయించి తమ ఆవేదనను వెలిబుచ్చారు . బాధిత కుటుంబ పరిస్థితిని చూసి చలించిపోయిన డాక్టర్ ప్రదీప్ కుమార్ లాభాపేక్ష పక్కన పెట్టి, అత్యంత తక్కువ ఖర్చుతో ఇక్కడే సర్జరీ చేపించాలని నిర్ణయించారు.

**రంగంలోకి నిపుణుల బృందం**

ఈ నెల 14వ తేదీన డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్ పర్యవేక్షణలో నిపుణులైన వైద్య బృందం రంగంలోకి దిగింది. ప్రముఖ పీడియాట్రిక్ న్యూరో సర్జన్ డాక్టర్ తరంగ్ వోరా, అనస్తీసియా నిపుణులు డాక్టర్ రవి కుసుమరాజు, చిన్నపిల్లల వైద్యనిపుణులు డాక్టర్ బ్రహ్మ కుమార్, ఓటి టెక్నీషియన్స్ రవి, అభిరామ్‌లు కలిసి అత్యంత సంక్లిష్టమైన ఈ శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసి ట్యూమర్‌ను తొలగించారు. అద్భుతమైన ఈ సర్జరీ ముగిసిన కేవలం 72 గంటల్లోనే బాలుడు పూర్తి కోలుకుని నడవడం విశేషం. ప్రస్తుతం బాలుడు పూర్తి ఆరోగ్యంగా ఉన్నాడని హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ ప్రదీప్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా అరుదైన సర్జరీని సక్సెస్ చేసిన వైద్య బృందాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.



## డిగ్రీ సెమిస్టర్ ఫలితాలలో మాతృశ్రీ ప్రభంజనం

చౌటుప్పల్, జూన్ 19(క్రైమ్ మిర్రర్ ): మహాత్మాగాంధీ యూనివర్సిటీ ప్రకటించిన డిగ్రీ రెండవ,నాల్గవ,ఆరవ సెమిస్టర్ ఫలితాలలో చౌటుప్పల్ పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక మాతృశ్రీ డిగ్రీ కళాశాలకు చెందిన తృతీయ సంవత్సరం విద్యార్థిని బొమ్మకంటి శ్రావణి ( బిఎస్సి - ఎంపీసీ ఎస్ - ) 9.88/10 స్గపా కెళ్ళ రుచిత బిఎస్సి ఎంపీసీ 9.88/10 ఎస్జిపిఏ సాధించగా...మరో 15 మంది పైగా విద్యార్థులు 9.0 కంటే ఎక్కువ ఎస్జిపిఏ సాధించి ఉత్తమ ప్రతిభను కనబరిచారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.మహేందర్ రెడ్డి మాట్లాడుతూ...విద్యార్థులు ప్రణాళికతో చదువుతూ..లక్ష్య సాధనకై నిత్యం కృషి చెయ్యాలని కోరారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు పుష్పగుచ్చం ఇచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ తో పాటు అధ్యాపక బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు






## హలో ఉప సర్పంచ్... ఛలో హైదరాబాద్ ను జయప్రదం చేయాలి

**బొట్ల కార్తీక్ ఉప సర్పంచ్ ల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు**

**క్రైమ్ మిర్రర్, నల్గొండ బ్యూరో:** చెక్‌పవర్ రద్దు పై వస్తున్న వార్తలను ప్రభుత్వం ఖండించాలని రాష్ట్ర ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బొట్ల కార్తీక్ కోరారు . శుక్రవారం నల్లగొండలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జోగు నగేష్ ఆధ్వర్యంలో ఈనెల 25న హైదరాబాద్ ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించే హలో ఉప సర్పంచ్ చలో హైదరాబాద్ కార్యక్రమం పోస్టర్ ఆయన ఆవిష్కరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉపసర్పంచ్‌ల చెక్ పవర్ రద్దు పై వస్తున్న వార్తలను ఖండించాలి అలాగే వార్డ్ మెంబర్లకు నెలకు 3,000 లు ఉప సర్పంచ్ లకు 5,000 లు గౌరవ వేతనం ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒకవేళ ప్రభుత్వం ప్రకటించని ఎడల జూన్ 25 న ఇందిరా పార్క్ వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఇందిరాపార్క్ వద్ద ఈనెల 25న నిర్వహించే భారీ ధర్నాకు ఉప సర్పంచులు అంత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మజ్జిగ నరేష్, మట్టా శ్రీనివాస్, కట్టంగూరు మండల అధ్యక్షుడు గోపగాని లింగమ్మ జానయ్య, అయితగోని వెంకటేశం, సతీష్, నవ్య అనిల్ కుమార్ గౌడ్, కడారి కొండల్, నక్క రాజేష్, మర్రి శివ తదితరులున్నారు.

## నడుస్తున్న కారులో ప్రమాదవశాత్తు మంటలు



**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి:** నాగర్ కర్నూల్ జిల్లా, వంగూరు మండలం కొండారెడ్డిపల్లి శివారులోని జడ్చెర్ల- కోదాడ జాతీయ రహదారి పై నడుస్తున్న కారులో మంటలు చెలరేగి కారు పూర్తిగా దగ్ధమైంది. ఈ సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులు తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలు ఆపేశారు ఇప్పటికే కారు పూర్తిగా తగ్గుదమైంది. కారు హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళ్తుండగా ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం జరిగినట్లు ప్రయాణికులు తెలిపారు.

## ఓటరు జాబితాల పారదర్శకతకు బూత్ లెవల్ ఏజెంట్లే కీలకం

**పాలకీడు మండల తహసీల్దార్ వాజీద్ అలీ**



**క్రైమ్ మిర్రర్, పాలకీడు :** ఎన్నికల ప్రక్రియలో బూత్ లెవల్ ఏజెంట్ల పాత్ర అత్యంత కీలకమైందని పాలకీడు మండల తహసీల్దార్ వాజీద్ అలీ అన్నారు. ఓటరు జాబితాల పరిశీలన, కొత్త ఓటర్ల నమోదు, మార్పులు-చేర్పులు, అభ్యంతరాల పరిష్కారం వంటి అంశాల్లో ఎన్నికల కమిషన్ నిబంధనలను పూర్తిగా అవగాహన చేసుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. తహసీల్దార్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) అందులో భాగంగా పాలకవీడు మండలంలోని వివిధ రాజకీయ పార్టీల బూత్ లెవెల్ ఏజెంట్లకు శుక్రవారం పాలకవీడు మండలం లోని గుడుగుంట్లపాలెం గ్రామం రైతు వేదిక లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదు, మార్పులు-చేర్పులు, అభ్యంతరాల స్వీకరణ, దరఖాస్తుల పరిశీలన తదితర అంశాలపై బూత్ లెవెల్ ఏజెంట్లకు అధికారులు వివరించారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని సూచించారు. బూత్ స్థాయిలో ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన మార్గదర్శకాలను అధికారులు తెలియజేశారు. ఓటర్ల వివరాల పరిశీలనలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ శ్రీనయ్య ,సీనియర్ అసిస్టెంట్ సైదులు,మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ రవీంద్ర బాబు, జిపివో లు, బిఎల్ఓ, సూపర్వైజర్ లు ,మండలంలోని వివిధ రాజకీయ పార్టీల బూత్ లెవెల్ ఏజెంట్లు హాజరయ్యారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
10 శనివారం 20-6-2026

# ఈ నెల 22 నుండి 26 వరకు జిల్లాలో మాదక వ్యతిరేక వారోత్సవం:ఎస్పీ



క్రైమ్ మిర్రర్, నల్గొండ బ్యూరో: ఈనెల 22 నుండి 26 వరకు జిల్లాలో పెద్ద ఎత్తున మాదకద్రవ్య వ్యతిరేక వారోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ తెలిపారు.

శుక్రవారం జిల్లా ఎస్పీ అధ్యక్షతన జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మాదకద్రవ్యాల నియంత్రణ జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదక ద్రవ్యాలను నివారించడంలో భాగంగా ప్రజలలో అవగాహన కల్పించేందుకు 26న నషా ముక్త్ భారత్ కింద అవగాహన కార్యక్రమాలను చేపట్టడం జరుగుతున్నదని, ఇందులో భాగంగా 22 నుండి 26 వరకు జిల్లాలో అనేక కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. 22న విద్యాసంస్థలలో అవగాహన కార్యక్రమాలు ,23 24న విద్యార్థులకు వివిధ రకాల పోటీల నిర్వహణ, 25, 26న గ్రామస్థాయిలో పోలీసు ఇతర శాఖల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే 26న 2కె రన్ ను నిర్వహించనున్నట్లు చెప్పారు. వారం రోజులపాటు నిర్వహించే ఈ మాదక ద్రవ్య వ్యతిరేక వారోత్సవం లో ప్రజాప్రతినిధులు, ప్రజలను భాగస్వామ్యం చేసి విజయవంతం చేయాలన్నారు. జిల్లాలో మత్తుపదార్థాల నివారణలో భాగంగా పాఠశాలలు, కళాశాలలో విద్యార్థులు మత్తుమందుల బారిన పడకుండా అన్ని పాఠశాల ,కళాశాల కమిటీలు చురుకుగా పనిచేయాలని, ఎక్కడైనా మత్తు పదార్థాలు వినియోగిస్తున్నట్లయితే తమ దృష్టికి తేవాలని కోరారు.అలాగే విద్యాసంస్థలకు వంద మీటర్ల పరిధిలో పాన్ ,గుట్కా తదితర షాపులు లేకుండా లేకుండా వాటి వివరాలు సమర్పించాలని అన్నారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యల నివారణలో భాగంగా అన్ని పాఠశాలలు, కళాశాలలతోపాటు, సంక్షేమ హాస్టల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని చెప్పారు. అలాగే విద్యార్థుల ప్రవర్తనను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, ఎవరైనా మాదకద్రవ్యాలకు అలవాటు పడ్డట్టయితే వారిని గుర్తించి తక్షణమే సమాచారం ఇచ్చి డి అడిక్షన్ సెంటర్ కు పంపించాలన్నారు. పాఠశాలలకు విద్యాసంస్థలకు వంద మీటర్ల పరిధిలో ఎలాంటి పాన్ , గుట్కా షాపులు లేకుండా చూడాలన్నారు. జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో చేపట్టిన మాదకద్రవ్య పునరావాస కేంద్రం పనులను తక్షణమే పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు .మాదకద్రవ్యాలు ఇతర ప్రాంతాల నుండి రవాణా కాకుండా తనిఖీలు కట్టుదిట్టంచేయాలని ఆదేశించారు. అడిషనల్ ఎస్పీ రమేష్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, డిఆర్ఓ దశరథ్, తదితరులు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల వ్యతిరేక వారోత్సవం పై అవగాహన కై రూపొందించిన గోడ పత్రికను జిల్లా కలెక్టర్ ఎస్పీ ఇతర అధికారులు ఆవిష్కరించారు జారీ చేసిన వారు సహాయ సంచాలకులు, ససమాచార శాఖ, నల్గొండలి



## భూమిని అప్పగించండి

### మార్కెట్ కమిటీ చైర్మన్ బిఎస్ ఆంజనేయులు

### ఆర్డీవో మండల రెవెన్యూ అధికారికి వినతి పత్రం అందజేత

క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: కుల్కచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీకి గోదాములు ఆఫీస్ కొరకు భూమిని పగించాలని వికారాబాద్ ఆర్డిఓ కుల్కచర్ల మండల రెవెన్యూ అధికారికి మార్కెట్ కమిటీ చైర్మన్ బిఎస్ ఆంజనేయులు శుక్రవారం వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నెంబర్ 637/పి(10:37) 10 ఎకరాల 37 గుంటల భూమిని గత 2022-2023 సంవత్సరంలో కుల్కచర్ల మండల రెవెన్యూ అధికారి అలాగే ఆర్డీవో సమక్షంలో సర్వే చేసి మ్యాప్ ఇవ్వడం జరిగింది. అట్టి భూమిని కుల్కచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీకి అప్పగించాలని ఆర్డీవోను ఎమ్మార్వోకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వంశీధర్ రెడ్డి, బోయిని కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల కేంద్రంలో లోక్ సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గోపాల్ నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జోగు వెంకటయ్య, జలీల్, లోక్య నాయక్, పీరంపల్లి సర్పంచ్ గడ్డం వెంకటయ్య, రాంపూర్ గ్రామ సర్పంచ్ చెక్కల తిరుపతయ్య, మోర వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నీల రాఘవేందర్, వెన్నచేటి అంజలయ్య, ఐలగారి కృష్ణయ్య, బక్కన శ్రీనివాస్, నల్లమల మొగులయ్య, భరత్ కుమార్, వడ్డే వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థిని చదువు కోసం గోలి శ్రీనివాస్ రెడ్డి ఆర్థిక చేయూత

క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి: రంగారెడ్డి జిల్లా మాడుగుల మండలం నాగిళ్ల గ్రామానికి చెందిన వడ్డమోని పావని ఉన్నత విద్యాభ్యాసం కొనసాగించేందుకు తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం హైదరాబాద్ లోని తన నివాసంలో రూ.15 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యార్థుల భవిష్యత్తు కోసం విద్య ఎంతో కీలకమని, ప్రతిభ ఉన్న విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఈ సహాయం అందించినట్లు ఆయన తెలిపారు. పావని విద్యలో మరింత రాణించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సింగం విజయ్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్, మాజీ డైరెక్టర్ సురమల్ల సుభాష్, నాయకులు డొక్కా లింగం, హానుమండ్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## రాజేంద్రనగర్‌లో జనసేన జెండా ఎగరవేయడమే లక్ష్యం: గోదాల భాస్కర్

### జనసేన అదినేత పవన్ కళ్యాణ్ సమక్షంలో పార్టీ లో చేరిన యువకులు, నాయకులు...



గండిపేట(క్రైం మిర్రర్): రాజేంద్రనగర్ నియోజకవర్గంలో జనసేన జెండా ఎగరవేయడమే లక్ష్యంగా పని చేస్తామని గోదాల భాస్కర్ అన్నారు. తెలంగాణ జనసేనపార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా పార్టీలోకి చేరికల జోరు పెరిగింది. పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సమక్షంలో అత్తాపూర్ సర్కిల్ హైదర్‌గైడ ప్రాంతానికి చెందిన గోదాల భాస్కర్ తన అనుచరులు, పలువురు కీలక నాయకులతో కలిసి జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం గోదాల భాస్కర్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో రాజేంద్రనగర్ నియోజకవర్గంలో జనసేన పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో రాజేంద్రనగర్ గడ్డపై జనసేన జెండాను ఎగరవేయడం ఖాయమని స్పష్టం చేశారు. పార్టీ అభివృద్ధి కోసం పూర్తి అంకితభావంతో పని చేస్తామన్నారు. నియోజకవర్గంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ ప్రజలకు అండగా ఉంటామన్నారు. పవన్ కళ్యాణ్ నాయకత్వంలో తెలంగాణలో జనసేన పార్టీని మరింత ముందుకు తీసుకెళ్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, రమేష్, కోటిరెడ్డి, కే.ప్రదీప్‌కుమార్, లక్ష్మణ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.




## నేడు ఉచిత కంటి పొర చికిత్స శిబిరం

క్రైమ్ మిర్రర్, నల్గొండ బ్యూరో: గుత్తా వెంకట్ రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో , శంకర నేత్రాలయా హాస్పిటల్ డాక్టర్స్ పర్యవేక్షణలో , చిట్యాల మండలం , ఉరుమడ్ల గ్రామంలో , తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి నివాసంలో శనివారం ఉదయం .09.00 గంటలకు ఉచిత కంటి పొర చికిత్స శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమం జరగనుంది.ఈ కార్యక్రమంలో తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి , నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం , భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, నల్గొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, తెలంగాణ డైరీ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ కుమార్ రెడ్డి , స్థానిక ప్రజా ప్రతినిధులు , సీనియర్ నేతలు , తదితరులు , పాల్గొననున్నారు.

# చేవెళ్లలో కాంగ్రెస్ బూత్ సైన్యానికి శిక్షణ

### ప్రతి బూత్‌లో పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యం: ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

### చేవెళ్లను కాంగ్రెస్ కంచుకోటగా మారుస్తాం: భీమ్ భరత్

క్రైమ్ మిర్రర్ చేవెళ్ల, జూన్ 19: చేవెళ్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసే దిశగా పార్టీ శ్రేణులు కార్యాచరణను వేగవంతం చేస్తున్నాయి. ఈ క్రమంలో చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని ఎస్ఎల్‌వీ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ భీమ్ భరత్ ఆధ్వర్యంలో బూత్ లెవెల్ ఏజెంట్లకు (దీూా) ప్రత్యేక అవగాహన, శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో పార్టీ విజయానికి బూత్ స్థాయి నాయకులు, ఏజెంట్లే నిజమైన వెన్నుముక అని పేర్కొన్నారు. ప్రతి ఓటరుతో ప్రత్యక్ష సంబంధాలు కలిగి ఉండేది బూత్ స్థాయి నాయకులేనని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత వారిపైనే ఉందన్నారు.ఓటర్ల జాబితా సవరణ, కొత్త ఓట్ల నమోదు, పోలింగ్ రోజున చేపట్టాల్సిన విధులు, ఎన్నికల నిబంధనలపై బీఎల్‌ఏలకు పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను, ప్రజా సంక్షేమ పాలనను ప్రతి ఇంటికీ చేర్చడంలో బూత్ స్థాయి ఏజెంట్ల పాత్ర అత్యంత కీలకమని స్పష్టం చేశారు.కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ భీమ్ భరత్ మాట్లాడుతూ.... ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సూచనల మేరకు నియోజకవర్గంలోని ప్రతి బూత్‌లో కాంగ్రెస్ పార్టీని తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దుతామని తెలిపారు. చేవెళ్లను కాంగ్రెస్ కంచుకోటగా మార్చడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.




ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రజలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి,రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి, చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ పామెన భరత్, తెలంగాణ టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్, తెలంగాణ పొల్యూషన్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణ రెడ్డి, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెల్లా నర్సింహ రెడ్డి, సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పిసరి సురేందర్ రెడ్డి,వివిధ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, బూత్ స్థాయి ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శంషాబాద్‌లో రూ.200 కోట్లతో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్' నిర్మాణానికి అడుగులు

### స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ): రాష్ట్రంలో విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేసి విద్యార్థులకు అత్యాధునిక విద్యా సదుపాయాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రాజెక్టులో భాగంగా శంషాబాద్ మండలంలోని చౌదరిగుడా గ్రామంలో రూ.200 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్ స్థలాన్ని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా స్కూల్ నిర్మాణానికి అవసరమైన మౌలిక వసతులు, రోడ్డు కనెక్టివిటీ, భవిష్యత్ అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో కూడిన ఆధునిక విద్యా సంస్థగా ఈ పాఠశాలను తీర్చిదిద్దేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. స్కూల్‌కు వెళ్లే అనుసంధాన రహదారి నిర్మాణానికి సంబంధించి ఎదురైన సమస్యను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ చొరవ తీసుకుని అక్కడికక్కడే పరిష్కరించారు. రోడ్డు నిర్మాణం వల్ల



భూములు కోల్పోతున్న రైతులతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. నష్టపోయే రైతులకు ప్రత్యామ్నాయంగా అనువైన ప్రభుత్వ భూమిని కేటాయించే అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు సానుకూలంగా స్పందించారు. దీంతో రోడ్డు నిర్మాణానికి ఉన్న అడ్డంకులు తొలగి సమస్య పరిష్కారమైంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నామని, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ద్వారా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కూడా నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నర్కుడ సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్, గణేష్ గుప్తా, చంద్రరెడ్డి, మహేందర్ ముదిరాజ్, ఎన్. శ్రీధర్ గౌడ్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, రైతులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.